



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక　PEN POWER TELUGU DAILY　ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 11　సంచిక :68　పేజీలు : 12　సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ)　ప్రచురణ : కాకినాడ　సోమవారం 11 నవంబర్ 2024　వెల : 5/-రూ॥

VOLUME : 11　ISSUE :68　PAGES : 12　EDITOR : G. A. RAO ( ANAND GANTYADA )　PUBLISHED : KAKINADA　MON 11 NOVEMBER 2024　PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada,Visakhapatnam, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## ఈ అంశాల ఆధారంగానే పదవులు ఇచ్చాం...

# బాధ్యతగా పనిచేయండి

**ఏపీలో రెండో విడత నామినేటెడ్ పదవుల కేటాయింపు**

**కొత్తగా నామినేటెడ్ పదవులు పొందినవారికి చంద్రబాబు శుభాకాంక్షలు**

**తగిన వ్యక్తికి తగిన గౌరవం విధానంతో పదవులు కల్పించామని వెల్లడి**

**పెన్ పవర్ డెస్క్:**ఏపీలోని కూటమి ప్రభుత్వం రెండో విడత నామినేటెడ్ పోస్టులు ప్రకటించిన సంగతి తెలిసిందే. నామినేటెడ్ పదవుల మొదటి లిస్టులో 20 చైర్మన్ పోస్టులు, ఒక వైస్ చైర్మన్ పోస్టు భర్తీ చేసిన ప్రభుత్వం... రెండో లిస్టులో ఏకంగా 62 మందికి చైర్మన్ పదవులు, సలహాదారు పదవులు కట్టబెట్టింది. సుదీర్ఘ కసరత్తు తరువాత... పదవుల కోసం వచ్చిన 30 వేల దరఖాస్తులను స్వయంగా పరిశీలించిన ముఖ్యమంత్రి నేతలను వివిధ పోస్టులకు ఎంపిక చేశారు. వీటిలో 60 రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవులు కాగా... క్యాబినెట్ హోదాతో రెండు సలహాదారు పోస్టులు ఉన్నాయి. పదవులు పొందిన అందరికీ ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపి... వారికి అభినందనలు తెలియజేశారు. పదవులను బాధ్యతగా భావించి ప్రజల కోసం నాయకులు పనిచేయాలని సూచించారు. "పదవుల ఎంపికపై సుదీర్ఘమైన, పటిష్టమైన కసరత్తు చేశాము. ఎంతో మంది ఆశావాహులు ఉన్నారు. అయితే కష్టపడిన వారికి న్యాయం చేయాలనే అంశం ప్రాతిపదికగా ముందుగా మిమ్మల్ని ఎంపిక చేశాము. పార్టీ కోసం మీ పోరాటం, కష్టం, త్యాగం, పనితీరు, విధేయత, క్రమశిక్షణ ఆధారంగా ఈ ఎంపికలు జరిగాయి. సార్వత్రిక ఎన్నికల్లో సరైన వ్యక్తికి సరైన చోట టిక్కెట్ అనే విషయంలో అనుసరించిన విధానం మంచి ఫలితాన్ని ఇచ్చింది. స్వయంగా ప్రజల నుంచి మీ ఎమ్మెల్యేగా ఎవరిని కోరుకుంటున్నారు అని ఐవీఆర్ఎస్ ద్వారా తెలుసుకుని... ప్రజామోదం ఉన్నవారికే టిక్కెట్లు ఇచ్చాము. ప్రజలు ఆ విధానాన్ని స్వాగతించారు. అందుకే చరిత్రలో లేని విధంగా 93 శాతం స్ట్రైక్ రేట్ తో, 57 శాతం ఓట్ షేర్ తో కూటమికి పట్టం కట్టారు. నేడు నామినేటెడ్ పదవుల విషయంలో కూడా అదే సూత్రాన్ని అవలంబించాం. ముఖ్యంగా తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో పార్టీ కోసం పనిచేసిన వారికి పదవులు ఇచ్చాం. గత ప్రభుత్వ దాష్టీకాలను ఎదుర్కొని 5 ఏళ్లు



ధైర్యంగా నిలబడిన వారికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాం. కేసులు, దాడులు, వేధింపులకు గురైన వారిని గుర్తుపెట్టుకుని గౌరవించాం. ఎన్ని సవాళ్లు వచ్చినా నిలబడి పోరాటం చేసిన వారికి, మహిళలు, యువతకు నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు కల్పించాం. బూత్ స్థాయి కార్యకర్తలకు రాష్ట్ర స్థాయి పదవులు ఇచ్చే ఏకైక పార్టీగా మన తెలుగుదేశం నిలుస్తుంది. చాలా మంది బూత్ ఇంచార్జ్‌లు, క్లస్టర్ ఇంచార్జ్‌లు, యూనిట్ ఇంచార్జ్‌లు, గ్రామ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులకు రాష్ట్ర స్థాయి పదవులు ఇచ్చాము. రానున్న రోజుల్లోనూ మరిన్ని పదవులు ఇస్తాము. గత 5 ఏళ్లు పార్టీ కార్యక్రమాల నిర్వహణలో, మెంబర్ షిప్ కార్యక్రమంలో, పార్టీ నిర్దేశించిన ఇతర లక్ష్యాలను చేరుకున్న వారికి నామినేటెడ్ పదవులు ఇచ్చాం. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తే ఎక్కడో మారుమూల గ్రామంలో ఉన్నవారికీ పదవి లభిస్తుందనేది నేటి ఈ పోస్టుల ద్వారా మరోసారి అందరికీ అర్థం అయ్యింది. మీకు పదవులు వచ్చాయి. మీతో పాటు ఇంకా చాలా మంది పార్టీ కోసం శ్రమించారు. పనిచేసిన వారికి న్యాయం చేసే క్రమంలో జరిగిన తొలి ఎంపికల్లో మీరు అవకాశం పొందారు. రానున్న రోజుల్లో ఇతరులకు కూడా తగిన విధంగా అవకాశాలు కల్పించి, గౌరవిస్తాం. ఇంకా చాలా మందికి ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లుగా, ఇతర పదవులు ఇస్తాం" అని ముఖ్యమంత్రి అన్నారు. పదవులు వచ్చిన నాయకులు, యువత రెండేళ్ల పదవీ కాలాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకుని ప్రజల కోసం నిజాయితీగా, కష్టపడి పనిచేయడం ద్వారా రానున్న రోజుల్లో రాజకీయంగా మరింత ఎదగడానికి ఆస్కారం

వివరాలు 2లో..

## పాపం... ఆ మహిళా జర్నలిస్టు

# నలిగిపోతోంది

- సామాజిక స్పృహపై పవన్ క్లాస్
- ఏదైనా ఘటన జరిగితే జనాలు వీడియోలు తీస్తుంటారని వెల్లడి
- ఘటనలు ఆపేందుకు వెనుకంజ వేస్తుంటారని వివరణ
- ఈ ధోరణి మారాలని హితవు



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సామాజిక స్పృహ కలిగిన వ్యక్తి అని తెలిసిందే. ఆయన ఆలోచనలు దాదాపు సామాజిక దృక్పథంతో కూడుకుని ఉంటాయి. ఇవాళ జర్నలిస్టులతో మాట్లాడుతూ, వారితోనూ సామాజిక స్పృహ గురించే చర్చించారు. మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయి... పాఠశాల స్థాయి నుంచే బాలికలకు ఆత్మరక్షణ శిక్షణ ఇస్తారా? అంటూ ఓ మీడియా రిపోర్టర్ పవన్ ను ప్రశ్నించాడు. అందుకు పవన్ ఆసక్తికరంగా

వివరాలు 2లో..

# జ్ఞాపకశక్తి మెదడులో మాత్రమే నిల్వఉండదు..

## అధ్యయనాల్లో సంచలన విషయాలు

**పెన్ పవర్ డెస్క్:**జ్ఞాపక శక్తి మనిషి మెదడు లో మాత్రమే నిల్వ ఉండ దని న్యూయార్క్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడైంది. కిడ్నీ, నరాల కణజాలం నుంచి కణాలు



వివరాలు 2లో..

## మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నివాసంలో కొనసాగుతున్న

# ఐటీ తనిఖీలు



- ఈ నెల 5న చెన్నై నుంచి వచ్చిన ఐటీ అధికారులు
- గత ఐదు రోజులుగా గ్రంధి నివాసంలో సోదాలు
- గ్రంధి వ్యాపార భాగస్వాములు, అనుచరుల ఇళ్లలోనూ తనిఖీలు
- ఇప్పటికే పలు కీలక పత్రాలు, నగదు స్వాధీనం చేసుకున్నట్టు వార్తలు

**పెన్ పవర్ డెస్క్:**పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నివాసంలో ఐటీ సోదాలు కొనసాగుతున్నాయి. చెన్నై నుంచి వచ్చిన ఆదాయ పన్ను శాఖ అధికారులు ఐదో రోజు కూడా తనిఖీలు నిర్వహించారు. ఐటీ అధికారులు

వివరాలు 2లో..

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన జస్టిస్ డీవై చంద్రచూడ్



- సీజేఐగా ముగిసిన జస్టిస్ చంద్రచూడ్ పదవీకాలం
- 2022లో బాధ్యతలు చేపట్టిన జస్టిస్ డీవై చంద్రచూడ్
- సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా
- 51వ సీజేఐగా రేపు ప్రమాణ స్వీకారం

**పెన్ పవర్ డెస్క్:**భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీకాలం నేటితో ముగిసింది. సీజేఐగా ఆయన ఇవాళ పదవీ విరమణ చేశారు. డీవై చంద్రచూడ్ 2022 నవంబరు 9న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా

వివరాలు 2లో..

## మహారాష్ట్ర ఎన్నికల్లో..

# కాంగ్రెస్ మేనిఫెస్టోలో 5 గ్యారెంటీలు



- మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు మేనిఫెస్టో ప్రకటించిన మహా వికాస్ అఘాడి
- రూ.3 లక్షల వరకు రైతు రుణ మాఫీ ప్రకటన
- మహాలక్ష్మి యోజన కింద మహిళలకు ప్రతి నెలా రూ.3000 హామీ
- నిరుద్యోగ యువతకు రూ.4 వేలు నిరుద్యోగ భృతి ప్రకటన

**పెన్ పవర్ డెస్క్:**మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడు తుండడంతో కాంగ్రెస్ నేతృత్వంలోని మహా వికాస్ అఘాడి కూటమి మేనిఫెస్టో ప్రకటించింది. ప్రధానంగా 5 హామీలను ప్రకటించింది. వ్యవసాయం, గ్రామీణా భివృద్ధి, పట్టణాభి వృద్ధి, ఆరోగ్యం, ప్రజా సంక్షేమంపై దృష్టిసారిస్తామని హామీ ఇచ్చింది. రూ. 3 లక్షల వరకు రైతు రుణ మాఫీ చేస్తామని కూటమి ప్రకటించింది.

వివరాలు 2లో..

## మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ మేనిఫెస్టో

# విడుదల చేసిన అమిత్ షా

- నవంబరు 20న మహారాష్ట్రలో ఎన్నికలు
- హామీలతో హోరెత్తిస్తున్న ప్రధాన పార్టీలు
- వృద్ధుల పెన్షన్ రూ.2,100కి పెంచుతామని బీజేపీ హామీ
- యువతకు 25 లక్షల ఉద్యోగాలు ఇస్తామని అమిత్ షా వెల్లడి
- రూ.25 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు



వివరాలు 2లో..

## రష్యా రాజధాని మాస్కోపై

# 34 డ్రోన్లతో దాడి చేసిన ఉక్రెయిన్

- 2022లో యుద్ధం ఆరంభమయ్యాక మాస్కోపై ఇదే అతిపెద్ద దాడి
- అన్ని డ్రోన్లను కూల్చివేశామని ప్రకటించిన రష్యా సైన్యం
- రష్యా తమపై 145 డ్రోన్లతో దాడి చేసిందన్న ఉక్రెయిన్



వివరాలు 2లో..

## అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్ల నిధుల వినియోగంపై

# ప్రభుత్వం ఉత్తర్వులు

- ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం రూ.15 వేల కోట్ల సాయం
- ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు ద్వారా సర్దుబాటు
- సీఆర్డీయే ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం
- మరో రూ.6,750 కోట్ల మేర నిధులు వచ్చే అవకాశం

వివరాలు 2లో..



## విశాఖలో పోలీసుల స్పెషల్ డ్రైవ్..

# 80 బైక్ సైలెన్సర్ల ధ్వంసం

- భారీ శబ్దం వచ్చే సైలెన్సర్లను బిగించవద్దని పోలీస్ కమిషనర్ ఆదేశాలు
- సైలెన్సర్ కు మాడిఫికేషన్ చేస్తే భారీ జరిమానా విధిస్తామని వెల్లడి
- బైక్ యజమానితో పాటు మెకానిక్ పైనా చర్యలు తీసుకుంటామని వార్నింగ్

**పెన్ పవర్ డెస్క్:**ద్విచక్ర వాహనాలకు భారీ శబ్దం వచ్చే సైలెన్సర్లను బిగించుకో వద్దని విశాఖపట్నం పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ వాహనదారుల కు సూచించారు. సైలెన్సర్ మాడిఫికేషన్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, భారీ మొత్తం లో ఫైన్ విధిస్తామని హెచ్చరించారు. ఇటీవల స్పెషల్ డ్రైవ్ నిర్వహించి బైక్ లకు అమర్చిన భారీ శబ్దం వచ్చే



వివరాలు 2లో..

# చంద్రబాబు, లోకేశ్ లకు కృతజ్ఞతలు తెలిపిన పట్టాభి



- రెండో విడత నామినేటెడ్ పోస్టులు ప్రకటించిన కూటమి ప్రభుత్వం
- స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ డైరెక్టర్ గా పట్టాభి
- టీడీపీ గళాన్ని గట్టిగా వినిపించినందుకు తగిన గుర్తింపు

వివరాలు 2లో..

**పెన్ పవర్ డెస్క్:**కూటమి ప్రభుత్వం రెండో విడత ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల్లో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ కు స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని కేటాయించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో

## ఎడిటర్ వ్యూ

# ట్రంప్ గెలుపు...మళ్ళీ ప్రధానిగా షేక్ హసీనా ?

అమెరికా ప్రెసిడెంట్ గా డొనాల్డ్ ట్రంప్ గెలవడం అమెరికాతో పాటు ప్రపంచ గమనాన్ని కూడా మార్చేసేదిగా ఉంటుందని అంతా విశ్లేషించుకుంటున్న సంగతి తెలిసిందే. ట్రంప్ బోల్డ్ డెసిషన్స్ బోలెడు తీసుకుంటారు అని పేరు. ఆయన గతంలోనూ అలాగే చాలా సంచలన నిర్ణయాలు తీసుకున్నారు.ఇదిలా ఉంటే ట్రంప్ రాకతో బంగ్లాదేశ్ లో రాజకీయం పూర్తిగా మారుతుందని అంటున్నారు. అదెలా అంటే ఇప్పటికి కొద్ది నెలల క్రితం బంగ్లాదేశ్ లో అనూహ్యమైన రాజకీయ పరిణామాలు జరిగి షేక్ హసీనా తన ప్రధాని పదవిని కోల్పోయి ఇండియాకు చేరుకున్నారు. ఆమె ప్రస్తుతం భారత్ లో ఉంటున్నారు.మరో వైపు బంగ్లాదేశ్ లో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు అయింది. ఆ విధంగా తాత్కాలిక ప్రధానిగా మహమ్మద్ యూనస్ కొనసాగుతున్నారు. షేక్ హసీనా గద్దె దిగడం అలాగే బంగ్లాలో అల్లర్లు రాజకీయం మార్పు వంటి సంఘటన వెనక అమెరికా పరోక్ష జోక్యం ఉంది అన్న అనుమానాలు కూడా ఉన్నాయని ప్రచారం సాగింది.జో బైడెన్ హస్తం ఉందని కూడా ప్రచారం సాగింది. ఇక జో బైడెన్ కి అలాగే ప్రస్తుతం ట్రంప్ మీద పోటీ చేసి ఓటమి పాలు అయిన కమలా హరీస్ కి మద్దతుదారుగా అత్యంత ఆప్తుడుగా ఉన్నారని కూడా అంటున్నారు. అంతే కాదు 2016లో ట్రంప్ మొదటిసారి అమెరికా ప్రెసిడెంట్ గా గెలిచినపుడు మహమ్మద్ యూనస్ చేసిన వ్యాఖ్యలను కూడా ఇపుడు గుర్తు చేసుకుంటున్నారు.అమెరికా ప్రెసిడెంట్ గా ట్రంప్ విజయంతో తాను శక్తిని కోల్పోయాను అని మాట్లాడలేకపోతున్నాను అని యూనస్ నాడు వ్యాఖ్యానించడం ద్వారా ట్రంప్ పట్ల తనకు ఉన్న వ్యతిరేక భావాన్ని వ్యక్తం చేశారు అని అంటున్నారు. మరో వైపు చూస్తే ఇపుడు ఆయనే తాత్కాలిక ప్రధానిగా ఉన్నారు.ఇపుడు బలమైన నేతగా మరోసారి అమెరికా పెద్దన్న పాత్రలోకి ట్రంప్ వచ్చారు. ఇక అమెరికా ఎన్నికలకు ముందే ట్రంప్ బంగ్లదేశ్ లో హిందువుల ఊచ కోత మీద ఘాటు విమర్శలు చేశారు. హిందువులను హింసించడాన్ని ఆయన తప్పు పట్టారు. ఇలా ఆయన మాట్లాడిన తీరుని చూసినా బంగ్లాలో రాజకీయ పరిణామాలు అక్కడ హిందువుల అగచాట్లు హసీనా పదవీచ్యుతి ఇవన్నీ కూడా ట్రంప్ కి నచ్చనివే అంటున్నారుదాంతో ఆయన కీలకమైన నిర్ణయం దిశగా అడుగులు వేస్తారు అని అంటున్నారు. పైగా భారత ప్రధాని నరేంద్ర మోడీకి ట్రంప్ కి మంచి దోస్తీ ఉంది. ఇక బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాతో కూడా మోడీకి మంచి స్నేహం ఉంది. ఆమెను తిరిగి గద్దెనెక్కించే విషయంలో అటు ట్రంప్ ఇటు మోడీ కలసి పనిచేసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.ఇక ట్రంప్ సాధించిన ఘన విజయం పట్ల మాజీ ప్రధాని షేక్ హసీనా ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేయడాన్ని కూడా గమనంలోకి తీసుకుంటే ఆమెకు ట్రంప్ రాక ఎంతటి సంతోషాన్ని కలిగిస్తుందో అర్థం చేసుకోవాలని అంటున్నారు. మొత్తం మీద చూస్తే ట్రంప్ రాకతో బంగ్లాదేశ్ లో పరిణామాలు వేగంగా మారుతాయని షేక్ హసీనా మళ్లీ ప్రధాని అయ్యే అవకాశాలు కూడా ఉంటాయని అంటున్నారు.

# మహారాష్ట్ర ఎన్నికల్లో.. కాంగ్రెస్ మేనిఫెస్టోలో 5 గ్యారెంటీలు

- మొదటి పేజీ తరువాయి

రుణాలను చెల్లించిన రైతులకు రూ.50,000 సాయం అందిస్తామని పేర్కొంది. మహాలక్ష్మి యోజన కింద మహిళలకు ప్రతి నెలా రూ.3,000 ఇస్తామని హామీ ఇచ్చింది. లడ్కీ బెహన యోజన కింద ప్రస్తుత ప్రభుత్వం రూ.1,500 ఇస్తుండగా దానిని రెట్టింపు చేస్తామని ప్రకటించింది. డిగ్రీ లేదా డిప్లొమా చదివిన నిరుద్యోగ యువతకు నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి అందిస్తామని పేర్కొంది.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కూడా కల్పిస్తామని మహా వికాస్ అఘాడి ప్రకటించింది. 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ప్రతి కుటుంబానికి రూ.500లకే ఏడాదికి 6 ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు ఇస్తామని వాగ్దానం చేసింది. బాబా సాహెబ్ అంబేద్కర్ కారిడార్, ఉద్యోగాల కల్పన లక్ష్యంగా నూతన ఇండస్ట్రియల్ పాలసీ, 2.5 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని పేర్కొంది.మహా వికాస్ అఘాడి కూటమి మేనిఫెస్టోని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విడుదల చేశారు. శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్, ఎన్సీపీ-ఎస్సీపీ ఎంపీ సుప్రియా సూలే, మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే, కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు. మేనిఫెస్టో విడుదల సందర్భంగా మల్లికార్జున ఖర్గే మీడియాతో మాట్లాడారు. తమ కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రంలో కుల గణన చేపడతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రస్తుతం 50 శాతంగా ఉన్న రిజర్వేషన్ పరిమితిని పెంచుతామని ఖర్గే అన్నారు. కుల గణన ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు కాదని, వివిధ వర్గాలకు మరిన్ని ప్రయోజనాలను అందించడమే లక్ష్యమని అన్నారు.

మహారాష్ట్ర అభివృద్ధికి తమ వద్ద ఐదు స్తంభాలు (5 హామీలు) ఉన్నాయని, ఈ హామీలు మహారాష్ట్రలోని కుటుంబాల అభ్యున్నతికి తోడ్పడతాయని మల్లికార్జున ఖర్గే విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రతి కుటుంబానికి ఏడాదికి దాదాపు రూ.3.5 లక్షల లబ్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ఇక రాజస్థాన్లో మాదిరిగా రూ.25 లక్షల ఆరోగ్య బీమా పథకాన్ని మహారాష్ట్రలో కూడా అమలు చేస్తామని ఖర్గే హామీ ఇచ్చారు.

# పాపం... ఆ మహిళా జర్నలిస్టు నలిగిపోతోంది

- మొదటి పేజీ తరువాయి

బదులిచ్చారు. "మీరు ఇప్పుడు నన్ను ఆత్మరక్షణ గురించి అడిగారు. ఇక్కడ చాలామంది పాత్రికేయులు నన్ను ప్రశ్నలు అడిగేందుకు వచ్చారు... మీ మధ్యలోనే ఇందాకటి నుంచి ఓ మహిళా పాత్రికేయురాలు నలిగిపోతూ ఉంది. మీరు నా నుంచి న్యూస్ బైట్ తీసుకోవాలనే హడావుడిలో ఉన్నారు తప్ప, మీ సాటి మహిళా విలేకరి నలిగిపోతున్న అంశం గుర్తించడంలేదు. ఇప్పుడు నేను చెప్పేదేమిటంటే... మొదట మనలోనే సామాజిక స్పృహ ఉండాలి. మన కళ్ల ముందు ఏదైనా ఘటన జరిగినప్పుడు... పోలీసులు వచ్చే లోపు అందరూ ఆ ఘటనను వీడియోలు తీస్తుంటారే తప్ప, వెళ్లి ఆ ఘటనను అడ్డుకోవాలి అనుకోరు. మొదట ఈ విషయంలోనే సామాజిక స్పృహ కలగాలి. సమాజంలో ఈ తరహా ఆలోచనా ధోరణి వచ్చిన రోజున ఇబ్బంది ఉండదు. నేను పనిచేసే షూటింగ్ లలో కూడా ఎవరైనా ఇబ్బంది పడుతుంటే, నేను గుర్తించి చర్యలు తీసుకుంటాను. ఇప్పుడు కూడా మీ మధ్యలో ఓ మహిళా జర్నలిస్టు నలిగిపోతుంటే గుర్తించి, ముందుకు రామ్మా అని చెప్పాను. ఇది కనీస ధర్మం. ప్రతి ఒక్కరూ ఈ గుణాన్ని అలవర్చుకోవాలి. కళ్ల ముందు ఆడపిల్లలను ఏడిపిస్తుంటే, చాలామంది చోద్యం చూస్తుంటారు. ఇలాంటి ఘటనల్లో కల్పించుకుంటే, ఒకవేళ పోలీసులు అండగా ఉండరేమో అని చాలామంది వెనుకంజ వేస్తుంటారు. కానీ, నేను చెప్పేదేమిటంటే... ఇలాంటి ఘటనల్లో మొదటి స్పందించాల్సింది ప్రజలే. ప్రజలే మొదటి రక్షకులు. నేను హోంమంత్రి గారికి, డీజీపీ గారికి కూడా చెప్పాను... ఎవరైనా నేరాలపై ఫిర్యాదు చేస్తే వారిని క్రిమినల్స్ లాగా చూడకండి అని చెప్పాను. గత ప్రభుత్వంలాగా మనం వ్యవహరించొద్దు అని కూడా వారికి స్పష్టం చేశాను" అని వివరించారు.

# ఈ అంశాల ఆధారంగానే పదవులు ఇచ్చాం... బాధ్యతగా పనిచేయండి

- మొదటి పేజీ తరువాయి

ఏర్పడుతుంది అని చంద్రబాబునాయుడు అన్నారు.

సింపుల్ గవర్నమెంట్... ఎఫెక్టివ్ గవర్నెన్స్ అనే మన నినాదాన్ని గుర్తుపెట్టుకుని ప్రజలతో మమేకమై పనిచేయాలని పదవులు పొందిన వారికి సీఎం సూచించారు. పదవులు వచ్చిన వారు ప్రజలతో మరింత సౌమ్యంగా, గౌరవంగా ఉండాలని... ఎక్కడా పదవీ అహంకారం, హడావుడి అనేది కనిపించకూడదని... అప్పుడే ప్రభుత్వంతో పాటు మీకూ మంచి పేరు వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు.

# విశాఖలో పోలీసుల స్పెషల్ డ్రైవ్.. 80 బైక్ సైలెన్సర్ల ధ్వంసం

- మొదటి పేజీ తరువాయి

సైలెన్సర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం కమిషనర్ ఆధ్వర్యంలో ఆర్కే బీచ్ కాళీమాత ఆలయం సమీపంలో సుమారు 80 సైలెన్సర్లను రోడ్ రోలర్ తో తొక్కించి ధ్వంసం చేశారు.బైక్ సైలెన్సర్లలో మార్పులు చేర్పులు చేసి భారీ శబ్దం వచ్చేలా చేయడం సరికాదని ఈ సందర్భంగా కమిషనర్ పేర్కొన్నారు. దీనివల్ల శబ్ద కాలుష్యం ఏర్పడుతుందని వివరించారు. కంపెనీ ఇచ్చే సైలెన్సర్లను మాత్రమే ఉపయోగించాలని వాహనదారులకు సూచించారు. సైలెన్సర్ కు మార్పులు చేస్తే బైక్ యజమానితో పాటు దానిని బిగించిన మెకానిక్ పైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బైక్ యజమానికి 3 నెలల జైలు, రూ.10వేల వరకు జరిమానాతో పాటు 3 నెలలపాటు లైసెన్స్ రద్దు చేస్తామని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. బైక్ నడిపే వారితో పాటు వెనక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని సీపీ శంఖబ్రత బాగ్చీ ఈ సందర్భంగా విశాఖ పౌరులకు తెలిపారు.

# మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ మేనిఫెస్టో విడుదల చేసిన అమిత్ షా

**పెన్ పవర్ డెస్క్:**మహారాష్ట్రలో ఎన్నికల కుంపటి బాగా రగులుకుంది. ప్రధాన పార్టీలన్నీ ఎన్నికల హామీలతో హోరెత్తిస్తున్నాయి. తాజాగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మహారాష్ట్ర ఎన్నికల కోసం బీజేపీ మేనిఫెస్టో విడుదల చేశారు. ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో మేనిఫెస్టోను ఆవిష్కరించారు. ఈ సభలో కేంద్రమంత్రి పియూష్ గోయల్ , మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ భవాంకులే, ముంబయి బీజేపీ అధ్యక్షుడు ఆశిష్ షేలార్ తదితరులు పాల్గొన్నారు.

కాగా, ఈ మేనిఫెస్టోలో... మహారాష్ట్రలో వృద్ధుల పెన్షన్ ను రూ.2,100కు పెంచుతామని తెలిపారు. మహారాష్ట్రలో యువతకు 25 లక్షల ఉద్యోగాలు ఇస్తామని పేర్కొన్నారు. మహారాష్ట్రలో స్కిల్ సెన్సస్ చేపడతామని అమిత్ షా వెల్లడించారు. మహిళల లఖ్ పతి దీదీ పథకాన్ని మరింత విస్తరిస్తామని చెప్పారు. ఎరువులపై రైతులు చెల్లించే జీఎస్టీని తిరిగి ఇచ్చేస్తామని,

తద్వారా ఆర్థికభారం తగ్గిస్తామని వివరించారు. మహారాష్ట్రలో పరిశ్రమల అభివృద్ధికి వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. రూ.25 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరల స్థిరీకరణకు చర్యలు తీసుకుంటామని అమిత్ షా వివరించారు. మహారాష్ట్రలో మొత్తం 288 అసెంబ్లీ స్థానాలకు, నవంబరు 20న ఒకే విడతలో ఎన్నికలు జరపనున్నారు. నవంబరు 23న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

# చంద్రబాబు, లోకేశ్ లకు కృతజ్ఞతలు తెలిపిన పట్టాభి

- మొదటి పేజీ తరువాయి

పలు సందర్భాల్లో పట్టాభి టీడీపీ గొంతుకను గట్టిగా వినిపించారు. అనేక దాడులను కూడా ఆయన ఎదుర్కొన్నారు. వెనుకంజ వేయకుండా పోరాడినందుకే పట్టాభికి పదవి ఇచ్చినట్టు టీడీపీ తన సోషల్ మీడియా ఖాతాలో వెల్లడించింది. దీనిపై పట్టాభి స్పందించారు. "కొన్ని నెలల క్రితం వరకు రాష్ట్ర రాజకీయ మైదానంలో ఉన్న చెత్తను శుభ్రం చేసే పనిలో ఉన్న నాకు... ఆ పనిని విజయవంతంగా పూర్తి చేశాక నేడు స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఇచ్చారు. తద్వారా రాష్ట్రంలో ఉన్న ప్రతి పట్టణాన్ని, ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచే కీలక బాధ్యత అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్ కు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను" అంటూ పట్టాభి ట్వీట్ చేశారు.

ఈ మేరకు చంద్రబాబు, లోకేశ్ లతో కలిసున్న ఫొటోలను కూడా పంచుకున్నారు.

# అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్ల నిధుల వినియోగంపై ప్రభుత్వం ఉత్తర్వులు

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ రాజధాని అమరావతి నిర్మాణం కోసం కేంద్రం రూ.15 వేల కోట్ల నిధులు కేటాయించడం తెలిసిందే. ఈ నిధులను ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు ద్వారా అందించేలా సర్దుబాటు చేసింది. ఈ నేపథ్యంలో, ఈ రూ.15 వేల కోట్ల నిధుల వినియోగానికి సంబంధించి ఏపీలోని కూటమి ప్రభుత్వం నేడు ఉత్తర్వులు జారీ చేసింది. అమరావతి అభివృద్ధి కోసం ప్రణాళికలు అమలు చేయాలని, ముఖ్యంగా, రోడ్లు, జలవనరులకు సంబంధించిన ప్రాజెక్టులు ఈ నిధులతో చేపట్టాలంటూ ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో సీఆర్డీయేకి దిశానిర్దేశం చేసింది. అత్యున్నత ప్రమాణాలతో కూడిన మౌలిక సదుపాయాలు, పర్యావరణ హిత నిర్మాణాలు, మెరుగైన ఉపాధి అవకాశాల కోసం ఈ నిధులు వినియోగించాలని ప్రభుత్వం సూచించింది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు నుంచి నిధులు అందుకునేందుకు సీఆర్డీయే కమిషనర్ కు అధికారాలు కల్పిస్తున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు ఏపీ మున్సిపల్ శాఖ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ జి.అనంతరాము పేరిట ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా, అమరావతి అభివృద్ధికి సీఆర్డీయే పంపిన ప్రతిపాదనలకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ ఆమోదం తెలిపింది. ఇక, ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు కూడా ఈ ప్రతిపాదనలకు పచ్చజెండా ఊపితే... అమరావతి నిర్మాణానికి మరో రూ.6,750 కోట్ల మేర నిధులు వచ్చే అవకాశం ఉంది.

# రష్యా రాజధాని మాస్కోపై 34 డ్రోన్లతో దాడి చేసిన ఉక్రెయిన్

**పెన్ పవర్ డెస్క్:**రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో గత కొన్నిరోజులుగా ఇరు దేశాలు పరస్పరం డ్రోన్ల దాడులు చేసుకుంటున్నాయి. తాజాగా, ఉక్రెయిన్ ఏకంగా 34 డ్రోన్లతో రష్యా రాజధాని మాస్కో నగరంపై దాడి చేసింది. అయితే, ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చివేశామని రష్యా సైన్యం ప్రకటించింది. మాస్కో దిశగా వస్తున్న 34 డ్రోన్లను కూల్చివేశామని, ఇతర ప్రాంతాల్లో మరో 36 డ్రోన్లను కూల్చివేశామని వెల్లడించింది. ఉక్రెయిన్ డ్రోన్ దాడుల నేపథ్యంలో, మాస్కో నగరంలోని మూడు ఎయిర్ పోర్టులకు వచ్చే విమానాలను దారి మళ్లించారు. 2022లో యుద్ధం మొదలయ్యాక రష్యా రాజధానిపై ఉక్రెయిన్ జరిపిన దాడుల్లో ఇదే పెద్దది. కాగా, ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్ స్కీ స్పందిస్తూ... రష్యా ఇటీవల తమ దేశంపై 145 డ్రోన్లతో దాడి చేసిందని ఆరోపించారు.

# జ్ఞాపకశక్తి మెదడులో మాత్రమే నిల్వఉండదు..

- మొదటి పేజీ తరువాయి

మెదడు కణాల మాదిరిగానే జ్ఞాపకాలను ఏర్పరుస్తాయని అధ్యయనం చెబుతోంది.మెదడులోని న్యూరోట్రాన్స్మిటర్ల పేలుళ్లను అనుకరించే రసాయన పప్పులు ఎప్పలుడు పునరావృ తమవుతాయో నాన్ మెదడు కణాలు గుర్తించగలవని పరిశోధన వెల్లడించింది. నేచర్ కమ్యూనికేషన్స్ జర్నల్ లో ప్రచురించబడిన ఈ అధ్యయనం జ్ఞాపకశక్తి సంబంధిత రుగ్మతలకు చికిత్స చేయడానికి కొత్త మార్గాలను సుగమం చేస్తుందని చెబుతోంది. శరీరంలో ఇతర కణాలు కూడా నేర్చుకోగలవు, జ్ఞాపకాలను దాచుకోగలవని" యూఎస్ లోని న్యూయార్క్ యూనివర్సిటీ రీసెర్చర్, రచయిత కుకుష్కిన్ చెబుతున్నారు. మెదడు కణాల మాదిరిగానే నాన్ మెదడు కణాలు కూడా కొత్త సమాచారానికి ప్రతిస్పందనగా మెమరీ జన్యువుని సక్రియం చేయగలవని పరిశోధకులు కనుగొన్నారు. జ్ఞాపకశక్తిని అధ్యయనం చేయడానికి కొత్త మార్గాలను అందించడంతోపాటు ఆరోగ్యాన్ని మెరుగుపర్చడానికి మన శరీరం మెదడు వంటిది అని పరిశోధన సూచిస్తుంది.

# మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నివాసంలో కొనసాగుతున్న ఐటీ తనిఖీలు

- మొదటి పేజీ తరువాయి

ఈ నెల 5న చెన్నై నుంచి వచ్చారు. గ్రంధి శ్రీనివాస్ వ్యాపార భాగస్వాములు, ఆయన అనుచరుల ఇళ్లలోనూ ఐటీ అధికారులు సోదాలు చేపట్టారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ శివార్లలో ఉన్న జీవీఆర్ ఆక్వా సంస్థలోనూ సోదాలు చేపట్టారు. ఆదాయ పన్ను శాఖ అధికారులు ఇప్పటికే పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలుస్తోంది. కొంతమేర నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. గత బుధవారం గ్రంధి శ్రీనివాస్ హైదరాబాద్ వెళుతుండగా, మార్గమధ్యంలోనే ఐటీ అధికారుల నుంచి ఫోన్ వచ్చింది. దాంతో ఆయన ప్రయాణాన్ని విరమించుకుని, భీమవరం తిరిగొచ్చారు. గత ఎన్నికల్లో గ్రంధి శ్రీనివాస్ జనసేన అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు చేతిలో ఓటమిపాలయ్యారు. అప్పటినుంచి ఆయన వైసీపీతో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల గ్రంధిపై పవన్ కల్యాణ్ ఫిర్యాదు చేసినట్టు వార్తలు వచ్చాయి. అయితే ఏకంగా ఐటీ అధికారులు రంగంలోకి దిగడం గమనార్హం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పవన్ పై ఒంటికాలి మీద ధ్వజమెత్తిన వారిలో గ్రంధి శ్రీనివాస్ కూడా ఉన్నారు. పవన్ కు పలుమార్లు సవాళ్లు కూడా విసిరారు. 2019 ఎన్నికల్లో పవన్ గాజువాక, భీమవరం నియోజకవర్గాల్లో పోటీ చేయగా... భీమవరంలో ఓడిపోయింది గ్రంధి శ్రీనివాస్ చేతిలోనే.

# సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన జస్టిస్ డీవై చంద్రచూడ్

- మొదటి పేజీ తరువాయి

బాధ్యతలు స్వీకరించారు. అయోధ్య రామ మందిర వివాదం, ఆర్టికల్ 370, బుల్డోజర్ చర్యలు, స్వలింగ సంపర్కుల వివాహం, ఎన్నికల బాండ్లు, ప్రైవేట్ ఆస్తి వివాదం వంటి అత్యంత కీలకమైన అంశాలపై తన పదవీకాలంలో తీర్పులు ఇచ్చారు. ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా 2016లో నియమితులయ్యారు. జస్టిస్ డీవై చంద్రచూడ్ తండ్రికి తగ్గ తనయుడిగా పేరుపొందారు. చంద్రచూడ్ తండ్రి యశ్వంత్ విష్ణు చంద్రచూడ్ (వైవీ చంద్రచూడ్) గతంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించారు. దేశ చరిత్రలో ఇప్పటివరకు అత్యధిక కాలం సుప్రీకోర్టు చీఫ్ జస్టిస్ గా పనిచేసింది వైవీ చంద్రచూడ్ ఒక్కరే. ఆయన వారసుడిగా న్యాయ వ్యవస్థలోకి అడుగుపెట్టిన డీవై చంద్రచూడ్, అంచెలంచెలుగా ఎదిగారు. సీజేఐ పదవికి డీవై చంద్రచూడ్ వన్నె తెచ్చారు. ఇక, డీవై చంద్రచూడ్ నేడు పదవీ విరమణ చేసిన నేపథ్యంలో, భారత 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా రేపు బాధ్యతలు స్వీకరించనున్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపు (నవంబరు 11) ఉదయం 10 గంటలకు జస్టిస్ సంజీవ్ ఖన్నాతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

## నేడు డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కమీషనర్ భావన వెల్లడి



**కాకినాడ. పెన్ పవర్ నవంబర్ 10 :** కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాలు సోమవారం జరగనున్నాయి. ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్‌కు ఫోన్లో ద్వారా వచ్చే సమస్యలను నమోదు చేసుకుంటారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో నేరుగా నగర ప్రజలు అందించే సమస్యల అర్జీలను నగరపాలక సంస్థ కమిషనర్ భావన స్వీకరించనున్నారు. నగర ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

10 YEAR ANNIVERSARY 2014 - 2024
పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

# కాదేదీ కబ్జాల కనర్హం





### వియర్ కాలువ కు వంతెన మోక్షం కలిగేనా..

**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 10:** ఖాళీ స్థలం కన్పిస్తే చాలుకబ్జా చేయడం తరువాత దాన్ని ఇష్టారాజ్యం గా అమ్ముకోవడం కొందరి ప్రవృత్తి. వీరికి స్థానిక నాయకుల అండ ఉందనేది జగమెరిగిన సత్యం.అందుకే మన గ్రామంలో విలువైన చెరువులు,పుంత రోడ్లు, రహదారుల అంచులు,చివరికి స్మశాన వాటికలూ కనుమరుగై పోతున్నాయనేది నగ్న సత్యం. ర్యాలీ గ్రామశివారు చిన్నం వారి పాలెం సుమారు100 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరునిత్యావసరాలు, విద్య, వైద్యం, ఏదేని పంచాయతీ అవసరాలకు ర్యాలీ గ్రామానికి రావాలంటే మట్టి రోడ్డు తప్ప వేరే దారి లేదు. వర్షా కాలమైతే నరకం చూడాల్సిందే. ఈ పుంత దారిలో సుమారు 500 ఎకరాల్లో పండించే మెట్టపంటలు కంద,బెండ,దొండ,పెండలం,అరటి మొదలగు పంటలు నిత్యం మార్కెట్ కు తరలించాలి. దీని తో రైతులు చాలా అగచాట్లు భరించక తప్పని పరిస్థితి. గతంలో పుంత రోడ్లు కొంత మేరకు అభివృద్ధి జరిగినా ఈ పుంత రోడ్డు మాత్రం ఎటువంటి అభివృద్ధి కీ నోచుకోలేదు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత గోదావరి నదిపై పడవ ప్రయాణం చేయాలంటే ప్రమాదకరంగా మారిందని. గోదావరి వరద ఉధృత ఎక్కువగా ఉన్న సమయంలో పడవ ప్రయాణం లో రవాణా వ్యవస్థ సతికిల పడడంతో అప్పటి ప్రభుత్వం గోదావరి నదులపై బ్రిడ్జి నిర్మించడానికి సుముఖం చూపింది. ప్రభుత్వ భూములే కేటాయించాలని ఈ బ్రిడ్జిలు వల్ల ప్రజలకు ఆస్తి నష్టం జరగకుండా చూడాలని అప్పుడు ప్రభుత్వంఆదేశాలు జారీ చేసింది.రూటు మాప్ 1967 సంవత్సరంలో ముందుగా జొన్నాడ - ర్యాలి మీదుగా పశ్చిమగోదావరి జిల్లా వొదురోళు పాలెం మీదుగా ఖండవల్లి ముక్కామల సమీపానికి బ్రిడ్జి పడవలసి ఉంది. ఆ సమయంలో భూస్వాములు పెత్తందారులు వ్యతిరేకించడంతో జొన్నాడ-రావుల పాలెం బ్రిడ్జి నిర్మాణ జరిగింది. అప్పటి కల కలగానే మిగిలిపోయింది.ఒకప్పుడు వాడుక భాషలో ర్యాలి పక్కన రావులపాలెం అంటేనే గాని ఎవ్వరికి అర్థం కాని పరిస్థితిలో ఉండేది! ఇప్పుడు రావుల పాలెం పక్కన ర్యాలి అనే పరిస్థితి నెలకుంది. ఇప్పటికైనా ఈ పుంత రోడ్డు పునర్నిర్మాణం

జరిగితే

ర్యాలీ గ్రామానికి రోడ్డు మార్గం ద్వారా అనుసందించాలని తద్వారా రైతులకు, ప్రజలకు రావులపాలెం మార్కెట్ కూత వేటు దూరంలో వుంటుందని తెలపక పోవడంతో అంతే కాక వియర్ కాలువ పై వంతెన చేపట్టక పొగా, పల్లెటి.నరసయ్య చేను దగ్గర నుండి విమానం మేడ శీనయ్య గారి చావడి మీదుగాస్మశాన వాటిక వరకు భూమిప్రక్క రైతుల చేతి వాటానికి గురై కబ్జా కోరల్లో చిక్కుకున్న దే. దీనిపై ప్రభుత్వ చర్యలు చేపట్టి మా గ్రామానికి తక్కువ వ్యవది లో గమ్యానికి చేరే విధంగా వియర్ కాలువ కు వంతెన వేసిపెద్ద పుంత మీదుగా రావులపాలెం గ్రామానికి చేరువ చేయాలని ప్రజలు కోరుతున్నారు.





# జఠిలమవుతున్న జగన్నాధపురం సమస్య



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్ నవంబర్ 10:** జిల్లా పరిషత్ స్థల సమస్య మండల అధికారులకు తలనొప్పిగా మారింది. తాడేపల్లిగూడెం మండలం జగన్నాధపురం లో ఉన్న జిల్లా పరిషత్ భూముల్లో అనేకమంది ఇల్లు కట్టుకున్నారు. మరి కొంతమంది వ్యవసాయం సాగు చేస్తున్నారు. మరి కొంతమంది ఆ భూములను ఆక్రమించుకొని గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు. అయినా అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో గ్రామానికి చెందిన అన్ని కులాల వారు ఈ జిల్లా పరిషత్ భూముల్లో పక్కాగా భవనాలు నిర్మించుకుని కాపురాలు చేస్తున్నారు. వీరికి ఇంటి పనులు వేస్తున్నారు. కొళాయి కనెక్షన్లు ఇచ్చారు. విద్యుత్ సరఫరా కూడా జరుగుతుంది. సుమారు 20 సంవత్సరాలు పైబడి ఈ జల పరిషత్ భూముల్లో నివాసాలు ఉంటున్నారు సాగు చేస్తున్నారు. అయినా స్థానిక ప్రజా ప్రతినిధులు గాని అధికారులు కానీ పరిశీలించలేదు పర్యవేక్షించలేదు. అభ్యంతరాలు కూడా తెలపలేదు. ఇలా ఉంటే ఇదే గ్రామానికి చెందిన తానేటి శ్రీనివాసరావు కూడా జల పరిస్థితి భూముల్లో ఇల్లు నిర్మించుకుంటున్నాడు. దీంతో గ్రామానికి చెందిన రాజకీయ పార్టీ నేత ఈ కట్టడం నిర్మించడానికి వీల్లేదు అంటూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావు తాను నిర్మించుకునే ఇంటికి ఎవరు ఎటువంటి అభ్యంతరము తెలుపకుండా ఉండడం కోసం ముందుగానే న్యాయస్థానాన్ని ఆశ్రయించారు ఇల్లు నిర్మించుకుంటున్నారు. ఇలా ఉండగా సమాచారం తెలుసుకున్న అధికారులు ఆ ఇంటి నిర్మాణ నిలుపుదల చేయాలని శ్రీనివాసరావును ఆదేశించారు అయినా తాను కోర్టు ఆదేశాల మేరకు ఇల్లు నిర్మించుకుంటున్నానని చెబుతూ తన పని తాను చేసుకుంటున్నారు. దీంతో సమస్య జటులం కావడంతో తాడేపల్లిగూడెం ఎమ్మార్వో పరిస్థితిని సమీక్షించి స్థలాన్ని పరిశీలించాలని వీఆర్వోలను ఆదేశించారు. అంతేకాకుండా ఈవో పి ఆర్ డి వెంకటేష్ కూడా జగన్నాధపురం పంచాయతీ కార్యాలయంలో ఉండి పరిస్థితిని సమీక్షించారు. ఆయనతో పాటు ఆర్ఐ కూడా శ్రీనివాస రావు నిర్మించి ఇంటి స్థలాన్ని ఇంటిని పరిశీలించి వెళ్లారు. జిల్లా పరిషత్ భూములు ఇల్లు నిర్మించుకోకూడదని శ్రీనివాసరావుకు నోటీసులు ఇచ్చిన వాటిని బేఖాతరు చేస్తూ ఇంటిని నిర్మిస్తున్నాడని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా తానేటి శ్రీనివాస్ రావు కూడా మాట్లాడుతూ జిల్లా పరిషత్ భూముల్లో తమ గ్రామానికి చెందిన అన్ని కులాల వారు ఆక్రమించుకుని పక్కా కట్టడాలు కట్టుకుని జీవిస్తున్నారని, అదేవిధంగా తాను కూడా ఇంటిని నిర్మిస్తుంటే అధికారులు, స్థానిక రాజకీయ పార్టీకి చెందిన నేత అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని దీనిపై తాను న్యాయస్థానాన్ని ఆశ్రయించానని విలేకరులకు తెలిపారు. అధికారులు మాత్రం కట్టడాన్ని నిలిపివేయాలని ఆదేశిస్తుండగా తాను న్యాయస్థానాన్ని ఆశ్రయించానని ఆ విధంగానే చేస్తానని చెబుతున్నారు. ఈ విషయంపై అధికారులు ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

## బ్యాంకు ఖాతాలను ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్ తో అనుసంధానం చేసుకోవాలి




### కలెక్టర్ షన్మోహన్

**కాకినాడ. పెన్ పవర్ నవంబర్ 10 :** ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారందరూ తమ బ్యాంకు ఖాతాలను ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్ తో అనుసంధానం చేసుకోవాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎన్ పీ సీ ఐ మ్యాపింగ్ ద్వారా

ప్రభుత్వ పథకాలు అర్హులకు మంజూరు చేసిన ఆర్థిక సహాయం తమ బ్యాంకు ఖాతాల్లో జమ కోసమేనని బ్యాంక్ ఖాతాలకు ఆధార్, మొబైల్ నెంబర్ అనుసంధానం అని ఆయన తెలిపారు.జిల్లావ్యాప్తంగా 20,96,877 మంది పౌరులు ఉండగా అందులో 18 సంవత్సరాలు పైబడిన వాళ్లు 17,11,043 మంది ఉన్నారని, అందులో 14,36,555 మంది నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎన్ పీ సీ ఐ లో తమ బ్యాంక్ అకౌంట్ ను ఆధార్ కార్డు , మొబైల్ నెంబర్ తో అనుసంధానం చేసుకున్నారని 2,74,488 మంది ఇంకా తమ బ్యాంక్ ఖాతాలకు ఆధార్, మొబైల్ నంబర్ తో అనుసంధానం చేసుకోవాలని ఆయన తెలిపారు. వీరందరూ ఎన్ పీ సీ ఐ మ్యాపింగ్ చేసుకోవాలని ఆయన కోరారు. దీనికి బ్యాంకర్లు , ప్రభుత్వ అధికారులు సహాయ సహకారాలు అందించి అర్హులైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్ అనుసంధానం పూర్తి చేయాలని ఆయన కోరారు. కాకినాడ జిల్లాలో ఎన్ పీ సీ ఐ మ్యాపింగ్ ఒక డ్రైవ్ తరహాలో చేస్తున్నారని. ప్రభుత్వ పథకాల ద్వారా సొమ్ములు అందుకుంటున్న లబ్దిదారుల్లో ఎవరికైతే బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం లేదో వారికి ఆధార్ అనుసంధానం చేయిస్తున్నారు. దీని ద్వారా నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్ పీ సీ ఐ) మ్యాపింగ్ చేస్తున్నారు. ప్రధానంగా బ్యాంకుల్లో, ప్రధాన పోస్టాఫీసుల్లో సేవింగ్ ఎకౌంట్ ఖాతాలతో ఆధార్ అనుసంధానం జరుగుతుంది. పోస్టాఫీసుల్లో ఐపీపీబీ సేవింగ్స్ ఖాతాలను కొత్తగా తెరిపించి ఆధార్ అనుసంధానం చేస్తున్నారు. త ద్వారా ఎన్ పీ సీ ఐ మ్యాపింగ్ జరుగుతుంది. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో ఈ ప్రక్రియ జరుగుతోంది. ఆయా సచివాల యాల పరిధిలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా ఆధార్ అనుసందా నానికి లబ్దిదారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారిని ఆధార్ అనుసంధానం చేసుకోవాలని , ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని కాకినాడ కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.ఇది కేవలం బ్యాంకు ఖాతాల నిమిత్తమే ఈ మ్యాపింగ్ జరుగుతోందని ఆయన స్పష్టంచేసారు.



### అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వపరంగా ఆదుకుంటాం

**జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్**

**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 10:** జగ్గంపేట మండలం రామవరం గ్రామంలో రంగవల్లి నగర్ లో అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని జనసేన జగ్గంపేట నియోజకవర్గం ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ అన్నారు. దీనిలో భాగంగా రమేష్ అగ్ని ప్రమాదంలో దగ్ధమైన ఇంటిని పరిశీలించి బాధిత కుటుంబంతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం ఆ కుటుంబానికి బియ్యం అందజేసి కొంత నగదు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జగ్గంపేట మండలం యువత అధ్యక్షులు మొగిలి గంగాధర్, రామవరం ఎంపీటీసీ దొడ్డా శ్రీను, ముమ్మన వేణుగోపాల్, మండపాక పాపన్న దొర, జన సైనికులు ఉన్నారు.

# తుమ్మలపల్లిలో పర్యాహరణం..!

- కోర్టు ఆదేశాలను కూడా బేఖాతరు..
- మంచినీటి చెరువులుగా అనుమతులు తీసుకుని ఉప్పునీటి సాగు..
- మత్స్యశాఖ అండదండలతో విచ్చలవిడిగా ఆక్వాసాగు..
- ఉప్పుకాసారాలుగా మారుతోన్న భూగర్భజలాలు..





**అల్లవరం,పెన్ పవర్,నవంబర్10?:** ఒకప్పుడు పచ్చని వరిచేలతో కలకలలాడే అల్లవరం మండలం తుమ్మలపల్లి ప్రాంతం అంతా ఇప్పుడు ఆక్వా అక్రమ ఉప్పునీటి సాగుతో చౌడు భూములుగా మారాయి.. ఆక్వాచెరువు దారుల అక్రమాలకు అడ్డుకట్టవేయాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో వారికి అండదండలందించి యధేచ్ఛకా ఆక్వా సాగు చేసుకునేందుకు గేట్లు ఎత్తిన పరిస్థితి తలెత్తింది అని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో అక్కడి వరి రైతులు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోగా హైకోర్టును ఆశ్రయించారు.అయితే చప్పనీటి సాగుతో అనుమతులు తీసుకుని ఉప్పునీటి సాగుచేస్తుండడంతో వాటిని ధ్వంసం చేసి ఆక్వా అక్రమాలకు అడ్డుకట్టవేయాలని ఆదేశిస్తూ హైకోర్టు ఉత్తర్వులిచ్చినా మత్స్యశాఖ అధికారులు నేటికీ పట్టించుకోని దుస్థితి తలెత్తింది. అధికారులు ఉదాసీన వైఖరిపై అల్లవరం మండలం తుమ్మలపల్లి గ్రామ ప్రజలు, రైతులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. అల్లవరం మండలం తుమ్మలపల్లి గ్రామంలో అనధికార ఉప్పునీటి ఆక్వాసాగుపై గ్రామానికి చెందిన 25 మంది రైతులు 2019లో ఉమ్మడి జిల్లా కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందనకు గతంలో ఫిర్యాదు చేశారు. దీనిపై రెవిన్యూ, మత్స్యశాఖ అధికారులు చేపట్టిన విచారణలో తుమ్మలపల్లి గ్రామంలో చప్పనీటి సాగు అనుమతులు తీసుకున్ని ఉప్పునీటి సాగు చేస్తున్నారని తేలడంతో దీనిపై మత్స్యశాఖ జేడీకు రిపోర్ట్ కూడా ఇచ్చారు. అయితే దీనిపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు 01 సెప్టెంబర్ 2021న అక్రమ ఆక్వా చెరువులను ధ్వంసం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిపై మత్స్యశాఖ ఆధ్వర్యంలో కేవలం కొన్ని చెరువులను ధ్వసం చేసి కొన్ని చెరువులను వదిలేశారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.. పైగా మత్స్యశాఖ కనుసన్నల్లో ధ్వసం చేయకుండా వదిలేసిన చెరువుల్లో ఉప్పునీటి బోర్లు వేసుకుని పూర్తిగా ఉప్పునీటి సాగుచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. దీనిపై మత్స్యశాఖ జేడీకు అనేకసార్లు ఫిర్యాదులు చేశామని, కేవలం నోటీసులు ఇస్తూ చర్యలు తీసుకోవడంలో మాత్రం ఉదాసీన వైఖరి అవలంభిస్తున్నారని, కేవలం మత్స్యశాఖ జేడీ వైఖరి వల్లనే తుమ్మలపల్లి గ్రామంలో చెరువులను ధ్వంసం చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీచేసినా అమలుకావడం లేదని ఆరోపించారు. మత్స్యశాఖ అధికారుల అవినీతి వల్ల తుమ్మలపల్లి గ్రామంలో సుమారు 40 ఎకరాల్లోని వరి పంట ఎందుకూ పనికిరాకుండా పోయిందని, భూగర్భజలాలు ఉప్పుకాసారాలుగా మారాయని మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మత్స్యశాఖ అవినీతిపై చర్యలు చేపట్టాలని స్థానిక రైతులు నాగాబత్తుల గణపతిరావు, బడుగు నాగేశ్వరరావు, సత్యనారాయణ, వడ్డి అర్జునరావు, వడ్డి విజయ్‌కుమార్ తదితరులు డిమాండ్ చేస్తున్నారు..

# బాబ్జి భవితవ్యం..?



- నిరాశలో కార్యకర్తలు.. తాత్సారం చేస్తున్న అధిష్టానం

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, నవంబర్ 10:**తెలుగుదేశం పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్చార్జ్ వలవల బాబ్జి భవితవ్యం పై కార్యకర్తలు నిరాశతో ఉన్నారు. పార్టీ బాధ్యతలు తీసుకుని దశాబ్ద కాలం పూర్తవుతునా టిడిపి బాబ్జి విషయంలో చురుకైన నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం చేస్తుందని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పార్టీ విషయంలో బాబ్జి కరుడుగట్టిన నాయకునిగా పనిచేస్తూనే ఉన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా అధికార పక్షంలో ఉన్న నిబద్ధతతో పనిచేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో తాను నిర్మించుకున్న కట్టడాలను కూల్చివేసినా పార్టీని వదలకుండా రాష్ట్రంలో కూటమి పార్టీ విజయానికి ఆయన ఎంతో కృషి చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో టిడిపి తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించే సమయంలో ఎన్నికల ఒప్పందంలో భాగంగా తాడేపల్లిగూడెం జనసేన పార్టీకి కేటాయించారు. అంతేకాకుండా వైసిపి హయాంలో కూడా టిడిపి పార్టీ ఇచ్చిన పిలుపులను బాబ్జి తూచా తప్పకుండా పాటిస్తూ అమలు చేస్తూనే ఉన్నారు. వివిధ సమావేశాలు సభలు ఏర్పాటు చేసి టిడిపి అధినాయకులను సైతం తాడేపల్లిగూడెం తీసుకొచ్చి తన అభ్యర్థిత్వంపై కూడా ప్రతిపాదనలు ఇచ్చారు ఒత్తిడి కూడా తెచ్చారు ఆ సభలో సమావేశాలకు వచ్చిన అధినాయకులు కూడా బాబ్జికే టికెట్ ఇచ్చే విధంగా అధిష్టానం పై ఒత్తిడి తెస్తామని కూడా హామీ ఇచ్చారు. నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు కూడా బాబ్జి టీడీపీకి చేస్తున్న సేవలను గుర్తించి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని గత 20 సంవత్సరాలుగా తాడేపల్లిగూడెం లో టిడిపి జెండా ఎగరవేయడం లేదని ఎన్నికల ఒప్పందాల్లో భాగంగా బిజెపి జనసేన పార్టీలకు తాడేపల్లిగూడెం టిక్కెట్టు కేటాయిస్తున్నారని ఈ పర్యాయమైన బాబ్జికి టిక్కెట్ ఇవ్వాలని సమావేశాల్లో పాల్గొన్న టిడిపి జిల్లా అధ్యక్షురాలు సీతామాలక్ష్మి మాజీ మంత్రులు పితాని సత్యనారాయణ, పుల్లారావును డిమాండ్ చేసిన సందర్భాలు ఉన్నాయి. తప్పనిసరిగా బాబ్జికి న్యాయం చేస్తామని కూడా వారు హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఒప్పందంలో భాగంగా కార్యకర్తలు అనుకున్న రీతిగానే తాడేపల్లిగూడెం టికెట్టు జనసేనకు కేటాయించడం మున్సిపల్ మాజీ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్ కు ఎమ్మెల్యే టికెట్టు ఇవ్వడం వంటివి జరిగాయి. ఆ సమయంలో బాబ్జి తోపాటు కొంతమంది నాయకులు కార్యకర్తలు కినుక వహించారు. దీంతో టిడిపి అధ్యక్షులు చంద్రబాబు స్పందించి బాబ్జిని అమరావతి పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ఎమ్మెల్సీ ఇస్తామని, నామినేటెడ్ పదవుల్లో ఉన్నతమైన పదవులు ఇస్తామని హామీ ఇచ్చి ఎన్నికల్లో విజయం సాధించడానికి కృషి చేయాలని బాబ్జిని ఆదేశించి పంపారు. చంద్రబాబు ఇచ్చిన భరోసాను స్వీకరించిన బాబ్జి గత అసెంబ్లీ ఎన్నికల్లో తమ క్యాడర్ తో పాటు బిజెపి జనసేన నాయకులతో కలిసి పార్టీ విజయానికి కృషి చేశారు. ఎమ్మెల్యేగా జనసేన అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాసు విజయం సాధించారు. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం మంత్రివర్గ విస్తరణ చేసినా వలవల బాబ్జి విషయం టిడిపి అధిష్టానం మరచింది. నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం వస్తాదని ఎదురుచూచిన బాబ్జి రాను రాను నిరాశకు గురవుతున్నారు. మొదటి దఫ నామినేటెడ్ పదవుల్లో మొదటి జాబితాలోనే బాబ్జికి పదవి దక్కుతుందని టిడిపి శ్రేణులు ఆశించారు. కానీ అధిష్టానం వలవల పేరు ఎక్కడ కనిపించకుండా చేసింది. మరల రెండో పర్యాయమైన నామినేట్ పదవులు బాబ్జికి దక్కుతుందని ఆశించారు కానీ ఈ పర్యాయం కూడా బాబ్జికి అధిష్టానం ఎటువంటి పదవి ఇవ్వలేదు సరి కదా పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన షరీఫ్, కొత్తపల్లి సుబ్బారాయుడు, కనకరాజు సూరి కి పదవులు దక్కాయి. కానీ అన్ని పోగొట్టుకున్న వలవల బాబ్జికి మాత్రం టిడిపి అధిష్టానం ఎటువంటి పదవి ఇవ్వకుండా మొండి చెయ్యి చూపుతూ వస్తోంది. అధికారం చేపట్టిన టిడిపి వంద రోజులు పూర్తయిన బాబ్జి విషయంలో అధిష్టానం నుంచి ఎటువంటి శుభపరిణామమైన మాటలు వినపడటం లేదు. ఇటీవల రెండో పర్యాయం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో బాబ్జి పేరు లేకపోవడంతో టిడిపి నాయకులు కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టిడిపి నియోజకవర్గంలో ఏమీ లేని సమయంలో బాబ్జి కేడర్ను నిలబెట్టాడని, విజయం సాధించి రాష్ట్రంలో అధికారం నిర్వహిస్తున్నా, వలవల విషయంలో అధిష్టానం నిర్లక్ష్యం వహించడం పట్ల కార్యకర్తలు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రానున్న కాలంలో టిడిపి అధిష్టానం వలవలకు ఎటువంటి పదవి ఇస్తారో, లేక నియోజవర్గ ఇన్చార్జిగానే ఉంచుతారు వేచి చూడాల్సి ఉంది.

# జీవో నెంబర్ 3 పునరుద్దించాలి..

- 100% ఉద్యోగాలు గిరిజనులకే ఇవ్వాలి..





**దేవీపట్నం,పెన్ పవర్,నవంబర్10:** ట్రైబల్ అడ్వైజర్ కౌన్సిల్ టి.ఏ.సి తక్షణమే స్పందించి పార్ల మెంట్ లో షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం తక్షణమే ప్రకటించాలని తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు.ఆదివారం దేవీపట్నం మండలం కొత్తవీధి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు.విద్యార్థులను ఉద్దేశించి ఆదివాసీ జేఏసీ వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ,రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు అరకు బహిరంగ సభలో జీఓ నెంబర్ 3 ను పునరుద్ధరించి 100 శాతం ఉద్యోగాలు ఆదివాసి పట్టభద్రులతోనే భర్తీ చేస్తానని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు.తక్షణమే ట్రైబల్ అడ్వైజర్ కౌన్సిల్ టి.ఏ.సి స్పందించి పార్లమెంట్ లో షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు.నేటికీ మారుమూల ప్రాంతాల్లో ఏకో ఉపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయన్నారు.ఆదివాసీ ప్రాంతాలలో టీచర్ ట్రైనింగ్ పొందిన ఆదివాసీ నిరుద్యోగ పట్టభద్రులు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లేక దుర్భర జీతం గడుపుతున్నరన్నారు.సమాజంలో ఉన్న అసాంఘిక కార్యకలాపాల ప్రభావం యువత పై ఎక్కువగా ఉంటుందన్నారు.రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు అరకు బహిరంగ సభలో జీఓ నెంబర్ 3 ను పునరుద్ధరిస్తానన్న హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ దేవీపట్నం మండల కార్యదర్శి యలగాడ నాగేశ్వరరావు,ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర,బొరగ నాగరాజు,విద్యార్థులు పాల్గొన్నారు.

# వాడపల్లి వెంకన్నను దర్శించుకున్న : కోనసీమ జిల్లా ఎస్పీ బి కృష్ణారావు



**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 10:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామంలో వేంచేసియున్న చందన స్వరూపుడు వెంకటేశ్వర స్వామి అలివేలు మంగ పద్మావతి సమేత కొలువై యున్న స్వయంభు క్షేత్రానికి ఆదివారం కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు చందన వెంకన్నను దర్శించుకున్నారు. వీరిని ఆలయ అధికారులు,అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించి సాలువాతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు అర్చకులు ఆత్రేయపురం ఎస్సై ఎస్.రాము సిబ్బంది పాల్గొన్నారు.

# స్వాములకు భిక్ష ఏర్పాటు చేసిన తెలుగు యువత ఉపాధ్యక్షుడు సురేష్



**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 10:** గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట గ్రామంలో ఉన్న శ్రీశ్రీశ్రీ బాల త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రతి సంవత్సరం అయ్యప్ప స్వాములకు బాపిరాజు కిరణా అధినేత ఆకుల శివ, యుగంధర్ రాంబాబు, నీలి అర్జునరావు ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిత్యం భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా జగ్గంపేట మండలం జె.కొత్తూరు గ్రామానికి చెందిన జగ్గంపేట నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు బద్ది సురేష్, బద్ది గిరిబాబు ఆధ్వర్యంలో ఆదివారం స్వాములకు భిక్ష ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వాములకు సురేష్, గిరిబాబు భోజనాలు వడ్డించారు. వారు మాట్లాడుతూ రాగంపేట గ్రామంలో స్వాములకు నిర్వహిస్తున్న అన్నదానం కార్యక్రమంలో తమ వంతు కృషి చేయడం జరిగిందని తెలిపారు. అలాగే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తమ కుటుంబం ఎప్పుడు ముందుంటుందన్నారు.

# రామకృష్ణ మిషన్ గిరిజన సంచార మెగా వైద్య శిబిరం..

- 400 మందికి వైద్యం అందించిన రామకృష్ణ మిషన్.





**దేవిపట్నం,పెన్ పవర్,నవంబర్10:**రామ కృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్య శాల రాజమండ్రీ సంస్థ అధ్వర్యంలో రంపచోడవరంలో ఆదివారం వైద్య శిభిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలియచేసినారు.ఈ వైద్య శిభిరం లో డాక్టర్స్ టి.వి.సుబ్బారావు రాయుడు శ్రీనివాస్,దాసరి ఉమమహేష్,ఎస్. సంపత్ కుమార్ పాల్గొని సుమారు 400మందికి వైద్య సేవలు అందించినట్లు స్వామీజీ తెలియ చేసినారు, అవసరం అయిన వారికి 68మందికి రక్తపరీక్షలు, 15మందికి, థైరాయిడ్ పరీక్షలు,5గురుకి ఇ.సీ.జీ.లు, 15మందికి ఫిజియథెరపీ లు చేసినట్లు స్వామీజి తెలిపారు.మరియు పరమహంస యోగానంద నేత్రలయం వేమగిరి వారిచే కంటి వైద్యశిబిరం నిర్వహించి నారు ఈ కంటి వైద్య శిబిరంలో 87మందికి కంటి పరీక్షలు చేసి 22మందికి కళ్లజోళ్లు అందించినారు.10మందిని , కంటి ఆపరేషన్స్ నిమిత్తం పరమహంస యోగానంద నేత్రలయం వేమగిరి తరలించినట్టు స్వామీజి తెలిపారు. మరియు జి.బి.ఆర్ ఫౌండేషన్ ద్వారా ఫిట్స్ క్యాంప్ నిర్వహించినారు.డాక్టర్ గోపాలం శివన్నారయణ,సిబ్బంది పాల్గోని సుమరు 76మందికి ఫిట్స్ కి సంబంధించిన మందులు అందజేసి ఫిట్స్ మూర్ఛ వ్యాధులు పైన అవగాహన కలిపించారు.ఈ కార్యక్రమంలో కె.మాలతి దేవి మరియు సలీం ఖాన్ పాల్గోన్నారు.రామ కృష్ణ మిషన్ అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని, స్వామీజీ చెప్పినారు.ఈ వైద్య శిబిరంలో క్యాంప్ కో ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్,పరమహంస యోగానంద నేత్రలయం ప్రోగ్రాం మేనేజర్ నక్కా చంటిబాబు మరియు సిబ్బంది మరియు వాలంటీర్స్ దాసరి పెద్ద అప్పారావు,సూర్య వర్మ సంజీవ్ పాల్గోన్నారు. రోగులకు,సహాయకులు కు అన్నదానం నిర్వహించినట్లు స్వామీజీ తెలిపారు.

# పాపికొండలు విహారయాత్రకు 7పర్యాటక బోట్లు..





- భారీగా విహారయాత్రకు వెళ్లిన పర్యాటకులు.

**దేవీపట్నం,పెన్ పవర్,నవంబర్10:** రెండు రోజుల్లో విహారయాత్రకు భారీగా పర్యాటకులు వెళ్లారు. ఆదివారం గోదావరి నదిలో పర్యాటక బోట్లు సందడి చేశాయి.పాపికొండలు పర్యాటక ప్రాంతం కళకళలాడింది.విహారయాత్రకు వెళ్లిన పర్యాటకులు అందరూ సంతోషాన్ని వ్యక్తం చేశారు.ఇక్కడ ప్రదేశాలు అద్భుతంగా ఉన్నాయని అన్నారు.దేవీపట్నం మండలం నుంచి పాపికొండల విహారయాత్రకు ప్రతిరోజు పర్యాటక బోట్లు వెళుతున్నాయి.శని ఆదివారాల్లో మాత్రం పర్యాటకుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది. శనివారం ఏడు పర్యాటక బోట్లలో 320 మంది పర్యాటకులు వెళ్ళగా, ఆదివారం 7 పర్యాటక బోట్లలో 400 మంది పర్యాటకులు గోదావరి నదిలో విహారయాత్రకు వెళ్లారు.ఈ రెండు రోజులు బోట్ల యజమానులకు,టూరిజం శాఖకు ఆదాయాన్ని తీసుకొస్తున్నాయి.ఉదయం 9 గంటలకు బయలుదేరిన పర్యాటక బోట్లు గోదావరి నది చుట్టుపక్కల ఉన్న ప్రకృతి అందాలను తిలకిస్తూ, మధ్యాహ్నం సమయానికి పాపికొండలకు చేరుకుంటారు.అక్కడ పేరంటాలపల్లి వద్ద శివాలయాన్ని దర్శించుకుని, పర్యాటక ప్రాంతాలను తిలకించి తిరిగి ప్రయాణం అవుతారు.సాయంత్రం ఐదు గంటలకు ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గండి పోచమ్మ తల్లి ఆలయం వద్ద ఉన్న బోట్ పాయింట్ వద్దకు చేరుకుంటారు. విహారయాత్రకి వెళ్లే పర్యాటకులు అందరికీ అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని,ప్రతి ఒక్కరికి లైఫ్ జాకెట్లు ఇస్తున్నామని టూరిజం శాఖ అధికారులు తెలిపారు. పర్యాటకులందరూ లైఫ్ జాకెట్లు వేసుకున్న తరువాతే బోట్లు గోదావరి నదిలో ప్రయాణిస్తున్నాయని చెప్పారు.

# మా కలెక్టర్ వద్దకు వెళ్లాలంటే...




**కూనవరం,పెన్ పవర్, నవంబర్ 10.**విలీన మండలాల ప్రజలంటే ప్రజా ప్రతినిధులకు, అధికారులకు చులకనగా ఉంది.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి విభజన తరువాత ఆంధ్ర ప్రదేశ్ లో కలిపి కష్టాలను చూపిస్తున్నారు.విలీన ప్రజల త్యాగఫలం కావాలి కానీ వారి కష్టాలను పట్టించుకోరు. తూర్పుగోదావరి జిల్లా నుండి పాడేరు జిల్లాలో కలిపారు.మా కష్టాలను మా కలెక్టర్ వద్దకు వెళ్లి చెప్పుకుందాం అంటే మాకు ఏపీఎస్ ఆర్టీసీ బస్సు లేదు.పాడేరును జిల్లా చేసిన కొత్తలో బస్ సర్వీస్ లేకపోవడంతో విలీన మండలాల విద్యార్థులు,ప్రజలు,ఉద్యోగులు పోరాడి బస్సు సర్వీసును సాధించుకున్నారు.ఏపీఎస్ ఆర్టీసీ బస్సు సర్వీసు కు ఆదాయం రావడంలేదని నిలుపుదల చేశారు. 370 కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా కేంద్రం పాడేరు కు సామాన్య ప్రజలు వెళ్లాలన్న,చదువుకున్న విద్యార్థులు,ఉద్యోగులు ఇంటర్వ్యూలకు వెళ్లాలన్న ఎంతో ఖర్చుతో వ్యాయ ప్రయాసపడి వెళ్ళవలసిన దుస్థితి.ఆర్టీసీ సంస్థకు ఆదాయమే పరమావధిగా ఆలోచించకుండా,విలీన ప్రజల కష్టాలను కూడా ఆలోచించాలని ప్రజలు కోరుతున్నారు.మా సమస్యలను,కష్టాలను మా కలెక్టర్ వద్దకు వెళ్లి చెప్పుకుందాం అంటే బస్సు లేకపోవడంతో టాటా మ్యాజిక్,ద్విచక్ర వాహనం,కారు ద్వారా వెళ్లాలి,దానికి అయ్యే ఖర్చు సామాన్యుడు వేలల్లో ఖర్చు చేయవలసిన పరిస్థితి.మా కష్టాలను జిల్లా కలెక్టర్ గుర్తించి యధావిధిగా పాడేరు టు కూనవరం మీదుగా భద్రాచలం వరకు బస్ సర్వీసును పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

# అటవీ అమరవీరుల దినోత్సవం



● ఘన నివాళులు అర్పించిన ఫారెస్ట్ అధికారులు



**చింతూరు, పెన్ పవర్, నవంబర్ 10** :అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో అశువులుబాసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పిస్తూ, అటవీ శాఖ సిబ్బంది తో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజనల్ అటవీ శాఖ అధికారిణి మాట్లాడుతూ విధి నిర్వహణలో తగు జాగ్రత్తలు తీసుకుని అటవీ సంరక్షణలో మన వంతు బాధ్యత నిర్వర్తించాలని చెప్పినారు. ప్రకృతిని అందులో ఉన్న జీవవైవిద్యాన్ని కాపాడుతూ అడవులను అందులో ఉన్న వన్యప్రాణులను రక్షిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు పాల్గొనినారు. ఎం భభిత, క్షేత్రాధికారి అజాద్, ఇతర సిబ్బంది పాల్గొని, విధినిర్వహణలో ప్రాణాలు అర్పించిన సిబ్బందికి ఘన నివాళులు అర్పించినారు.

## "అందరూ బాగుండాలి" "అందులో మేము ఉండాలి" అన్నదే "రెడ్డి కులం" నైజం...

## సామాజిక వనభోజన కార్యక్రమంలో రెడ్డి ప్రజా ప్రతినిధుల ఉవాచ...






**అనపర్తి,పెన్ పవర్,నవంబర్ 10:**
రెడ్డి కులం అదో అగ్రవర్ణ సామాజిక వర్గంగా పరిగణించొద్దని అందరూ బాగుండాలి అందులో మేము ఉండాలి అనే ఆలోచనతో అందరినీ కలుపుకుపోయేదే రెడ్డి కులమని ఆంధ్రప్రదేశ్ కు చెందిన అనపర్తి, మాచర్ల, కనిగిరి ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఉగ్ర నరసింహారెడ్డి, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే ఏరాసు ప్రతాపరెడ్డి లు పేర్కొన్నారు. ఆదివారం కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమం సంఘం తరఫున అనపర్తి లో జరిగిన రెడ్డి కులస్తుల సామాజిక వనభోజన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ పదిమందికి పని కల్పిస్తూ తమతో పాటు ఆ పదిమంది ఆర్థిక అభివృద్ధి చెందాలని ఆకాంక్షించే కులమే రెడ్డి కులం అన్నారు. జూలకంటి బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ రాజకీయంలో సాగుతున్న తమకు అన్ని కులాలతోనూ సత్సంబంధ బాంధవ్యాలు ఉంటాయని తాము ఏ కులంలో పుట్టిన అన్ని కులాల వారిని అక్కున చేర్చుకునే తత్వం తమకు ఉంటుందన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రెడ్డి కులానికి చారిత్రపరంగా ఒక ప్రస్థానం ఉందని అన్నపోతారెడ్డి పాలన సాగించిన ప్రాంతంగా వేణుగోపాల స్వామికి అన్నపర్తి ప్రాంతాన్ని శాసనం చేసిన చరిత్ర చెబుతుంది అన్నారు. రెడ్డి కులస్తులు పదిమందిని ఆదుకోవడంలో, సమాజ నిర్దేశంలో, క్రమశిక్షణతో ముందుకు నడిచే మంచి గుణమున్న కులం రెడ్డి కులం అన్నారు. సమాజంలో ఏ కులమైన అనుకూలంగా ఏ మతమైనా ప్రజాభిమతానికి హితమైనదిగా ఉన్నప్పుడే సమాజం సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉంటుంది అన్నారు. శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే ఏరాసు ప్రతాపరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో రెడ్లను కూడా కాపులుగా పిలుస్తారని, కాపు అంటే ఆ గ్రామానికి ఆ ప్రాంతానికి కాపు కాసే వాడని, మంచి చేసే వాడిగా పరిగణిస్తారని చెప్పారు. కుల సంఘములు ఆయా సామాజిక వర్గాలలో ఉన్న పేద నిరుపేదలకు ఏదో విధంగా సహాయ పడాలని సూచించారు. కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమం సంఘం తరుపున ఏర్పాటు చేసిన వనభోజనాలకు ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు జనం వస్తూనే ఉన్నారు. స్త్రీ పురుష బేధం లేకుండా సుమారు పాతికవేల మంది ఈ వనభోజన కార్యక్రమానికి హాజరయ్యారు. సంక్షేమ సంఘం అధ్యక్షులు కర్రి త్రినాధ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తూర్పు పశ్చిమగోదావరి జిల్లాలో రెడ్డి సంక్షేమం గురించి పాటుపడుతున్న వారిని ఉచిత రీతిని సత్కరించారు. ఒంటిగంట ప్రాంతానికి విచ్చేసిన ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మారెడ్డి ఏరాసు ప్రతాపరెడ్డి ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి స్థానిక ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి లను రెడ్డి సంఘం ఉచిత రీతిని సత్కరించింది. సంఘం తరఫున నిర్వహించిన లక్కీ డీప్ లో ప్రముఖులచే డ్రా తీయించి గెలుపొందిన విజేతలకు భారీ సంఖ్యలో బహుమతులను ప్రముఖులచే అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, చిర్ల జగ్గిరెడ్డి, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ నల్లమిల్లి మనోజ్ రెడ్డి, సర్పంచ్ల సంఘం మాజీ అధ్యక్షుడు పడాల వెంకటరామారెడ్డి
మహిళ నాయకురాళ్ళు మాజీ ఎంపీపీ కర్రి శేషారత్నం, నల్లమిల్లి కాంతమ్మ తమలంపూడి సుధాకర్ రెడ్డి, యువజన నేత మల్లిడి ఆదినారాయణ రెడ్డి, సంఘ సభ్యులు తాడి చంద్రశేఖర్ రెడ్డి, సత్తి వీరెడ్డి, చైతన్య రాజబాబు, మల్లిడి సూరారెడ్డి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.







# మద్ది ఆంజనేయుని సేవలో హైకోర్టు రిజిస్టర్ దంపతులు







**గోపాలపురం, పెన్ పవర్, నవంబర్ 10**
కార్తీక మాసం పురస్కరించుకుని జంగారెడ్డిగూడెం మండలంలో ఉన్న మద్ది ఆంజనేయ స్వామి వారి ఆలయంలో హైకోర్టు రిజిస్టర్ ప్రోటోకాల్ ఆర్వి సుధ రాఘవస్వామి దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ దంపతులకు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఏవి చందన పూర్ణకుంభం తోస్వాగతం పలికారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం రిజిస్టర్ దంపతులకు ఈవో, ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆహ్వానించారు. స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రాఘవస్వామి దంపతులకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు బహూకరించి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. మేళ తాళాలు మంగళ వాయిద్యాల మధ్య జరిగిన పూజా కార్యక్రమంలో ఈఓ చందనతో పాటు ఆలయ అధికారులు పాల్గొన్నారు. ఆదివారం కార్తీక పౌర్ణమి పుణ్య దినం, ఏకాహం పూర్తి కావడంతో ప్రత్యేకంగా తయారుచేసిన వాహనంపై స్వామివారిని ఊరేగించారు. ఆలయ ప్రాంగణం తీన్మార్ డప్పు వాయిద్యాల మోతలు విచిత్ర వేషధారణల మధ్య కన్నుల పండుగగా ఉంది. అలాగే ఊనగట్ల తదితర గ్రామాలకు చెందిన హరి కృష్ణ కోలాట బృందం చిన్నారులు కోలాట ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకున్నది. కార్తీక మాసం శని ఆదివారాలు సెలవు దినాలు కావడంతో స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. భక్తుల సౌకర్యార్థం త్రాగునీరు అన్నదానం వంటి వి ఏర్పాటు చేసినట్లు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చందన తెలిపారు.

## దాతృత్వం కలిగిన వ్యక్తి జమల్ ఖాన్




**కూనవరం,పెన్ పవర్, నవంబర్ 10.**పోలిపాక గ్రామానికి చెందిన బూయ్యన వెంకటాద్రి తీవ్ర అనారోగ్యంతో మృతి చెందడంతో తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు జెకె టిసి ట్రస్ట్ చైర్మన్ ప్రముఖ ఆయుర్వేదిక్ డాక్టర్ జమల్ ఖాన్ కుటుంబాన్ని పరామర్శించి 5వేలు ఆర్థిక సాయం చేశారు.విలీన మండలాలలో ఎవరు ఆపదలో ఉన్నారని తెలిసిన వెంటనే వారి కుటుంబంలో పెద్దల నేనున్నాననే ఆత్మ ధైర్యాన్ని కల్పిస్తు,దాతృత్వం కలిగిన వ్యక్తి జమాల్ ఖాన్.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి ఎడవల్లి భాస్కరరావు,తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోడియం అప్పారావు, గడేసుల ప్రేమ్ చంద్,సీనియర్ నాయకులు చెలికాని ఉమామహేశ్వరరావు,పట్టు భాస్కరరావు,వీరమల్ల సునీల్,నీరుడు లక్ష్మీనారాయణ,మడకం చిన్ని ,షేక్ రసూల్, మరియు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## కార్తీక వన సమారాధనలో పాల్గొన్న జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి



**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 10:** కాకినాడ రూరల్ నియోజకవర్గంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో 4వ కార్తీక వనసమారాధన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్, రామచంద్రపురం గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ అక్కడికి వచ్చిన పలువురు కూటమి నాయకులతో పలు అంశాలపై మాట్లాడారు. ఆయన వెంట జగ్గంపేట జనసేన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## కేంద్ర మంత్రిని కలిసిన చాట్రాతి ప్రసాద్



**జీలుగుమిల్లి, పెన్ పవర్, నవంబర్ 10** :కేంద్ర భారీ పరిశ్రమల ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాస వర్మను భారతీయ జనతా పార్టీ ఏలూరు జిల్లా కార్యదర్శి చాట్రాతి ప్రసాద్ ఆదివారం కలిశారు. జంగారెడ్డిగూడెంలో జరిగిన క్షత్రియ వన సమారాధనకు శ్రీనివాస్ వర్మ విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక నేత ఎం ఎస్ ఆర్ ఇంటివద్ద చాట్రాతి ప్రసాదు కలిశారు. ఈ సందర్భంగా చాట్రాతి మాట్లాడుతూ పలు ప్రజా సమస్యలను, రైతాంగ సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకు వెళ్లినట్లు ఆయన తెలిపారు. ఇందుకు కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ సానుకూలంగా స్పందించారని చాట్రాతి తెలిపారు. ఈయన వెంట బిజెపి నాయకులు పైడిమర్ల కోటిరెడ్డి తదితర నాయకులు ఉన్నారు.

## గంజాయి, విద్యుత్ ఉచ్చులపై వారపు సంతలో

- అవగాహన సమావేశం
- ఎస్సై శివకుమార్



**చింతూరు, పెన్ పవర్, నవంబర్ 10:**డొంకరాయి గ్రామంలో జరిగిన వారపు సంతలో అవగాహన సమావేశం లో ఎస్సై శివకుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యమైన గంజాయిని పండించడం రవాణా చేయడం తాగడం అమ్మడం నేరమని, గంజాయి మొక్కల పెంపకానికి కూలి పనికి వెళ్ళినా సరే నేరం కిందికే వస్తుందని అన్నారు. గంజాయిని రవాణా చేసే సమయంలో దళారల మాటలు నమ్మి, డబ్బులు కోసం ఆశపడి పైలెట్ నిర్వహించినా శిక్షార్హమేనని తెలిపారు. అదే విధంగా అడవి జంతువులైన కొండ గొర్రెలు కోసం, అడవి పందుల కోసం కరెంటు ఉచ్చు బిగించి వాటిని చంపినా నేరమని అన్నారు. అలాంటి కరెంటు ఉచ్చుల వల్ల మనిషి చనిపోయే ప్రమాదం ఉందని తెలియజేశారు. గ్రామ పెద్దలతో ప్రజలకు అర్థం అవడానికి కొందు, ఒడియా భాషలతో అర్థమయ్యేలా చెప్పించారు. ఈ సమావేశంలో సంతకు వచ్చిన ప్రజలు, గ్రామస్తులు, గ్రామ పెద్దలు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# 21న నీటి సంఘాల ఎన్నికలు

**ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 10:**మండలంలోని నాలుగు నీటి సంఘాలకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియను ఈనెల 21వ తేదీన నిర్వహించనున్నట్లు తాసిల్దార్ కేజే.ప్రకాష్ బాబు తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రమైన ఆలమూరు విద్యాశాఖ కార్యాలయంలో పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లకు ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాలలో ఉన్న రైతుల ఓటర్ల జాబితాలను స్థానిక రెవెన్యూ సిబ్బంది సహకారంతో ఇప్పటికే సిద్ధం చేసామన్నారు. మండలంలో మడికి, చెప్పెల్ల, చింతలూరు, ఆలమూరు గ్రామాలకు సంబంధించి నాలుగు నీటి సంఘాలు ఉండగా ఒక్కొక్క నీటి సంఘంలో 12 డిసీలు చొప్పున మొత్తం 48 డిసీలు ఉన్నాయన్నారు. వాటి పరిధిలోని రైతుల వివరాలను సేకరించి ఇందులో మృతుల వివరాలను నమోదు చేశామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులకు ఎటువంటి సందేశాలు ఉన్నా గ్రామస్థాయిలో ఉన్న రెవిన్యూ సిబ్బందిని సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ సుబ్బరాజు, రెవిన్యూ,సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



## గాయపడ్డ యువకుడికి వైద్య ఖర్చులు నిమిత్తం 30వేలుఆర్థిక సాయం



**కొత్తపేట, పెన్ పవర్, నవంబరు10:**డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం రాముడు నూతి మెరక గ్రామానికి చెందిన దంగేటి శేఖర్ అనే యువకుడు ఇటీవల రావులపాలెం బ్రిడ్జి మీద ఘోర ప్రమాదానికి గురై తలకు బలమైన గాయం అయ్యింది. అతనికి రాజమండ్రి బోల్లినేని హాస్పిటల్ నందు చికిత్స అందించారు. కానీ సుమారుగా ఒక సంవత్సరం వరకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులు చూసించారు. అతని కుటుంబ సభ్యులు ఇంటి వద్దనే అతనికి వైద్య సేవలును చేయిస్తూ, ప్రతి పదిహేను రోజులుకు ఒకసారి వైద్య చికిత్సకు రాజమండ్రి తీసుకెళ్లడం జరుగుతుంది. చిన్న వయస్సులోనే ఈ ప్రమాదం జరగడం వల్ల ఒక్కసారిగా కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అతని ఆర్థిక పరిస్థితి కూడా అంతంత మాత్రమే ఉండటంతో వైద్య చికిత్సకు కూడా కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్నారనే విషయం తెలుసుకున్న కొత్తపేట మండల యువ శెట్టి బలిజ సంఘం వారు వైద్య చికిత్స నిమిత్తం 30 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో యువ శెట్టిబలిజ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిర్ణయాలపై పోరాడతాం

### అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ ఉప్పులేటి



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, నవంబర్ 10:**ఎస్సీ వర్గీకరణ పై ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని అఖిలభారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ ఉప్పులేటి దేవి ప్రసాద్ పిలుపునిచ్చారు. జంగారెడ్డిగూడెం లైన్స్ క్లబ్ ఫంక్షన్ హాల్ లో ఆదివారం జరిగిన మాలల సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఉప్పులేటి మాట్లాడుతూ ఆగస్టు ఒకటో తేదీన సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వాలు చేసుకునే అధికారం ఉందని తీర్పును ఇవ్వడం దేశంలో ఉన్న అంబేద్కర్ వాదులందరూ నిరసిస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్లో వర్గీకరణ పై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 80 లక్షల మాలలు అడ్డుకుంటారని, వ్యతిరేకిస్తారని హెచ్చరించారు. 2004 నవంబర్ 5వ తేదీన సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని ఆనాడు తీర్పునిస్తే, అదే తీర్పుని ఇదే సుప్రీంకోర్టు కొట్టి వేయటం చాలా బాధాకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి రిజర్వేషన్ల పరిరక్షణకు అఖిలభారత మాల సంఘాల జేఏసీ దేశవ్యాప్తంగా పోరాడుతుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్లో డిసెంబర్ 15న హలో మాల, చలో అమరావతి కార్యక్రమాన్ని లక్షలాదిగా నిర్వహిస్తున్నామని ప్రకటించారు. దేశంలో ఉన్న అంబేద్కర్ వారసులను ఏకం చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గత తీర్పును దృష్టిలో పెట్టుకొని వర్గీకరణ జోలికి రావద్దని ,అసెంబ్లీలో తీర్మానం చేయడానికి ముందుకు వెళ్లొద్దని సూచించారు. గతంలో వర్గీకరణ చేసినందుకే 2004లో మాలలు ఓడించారని, సుప్రీంకోర్టులో కూడా మాలలు గెలిచారని వివరించారు . మరల చట్టం చేసిన సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న మాల యువకులు, విద్యార్థులు నిరుద్యోగులు పెద్ద ఎత్తున ఈ ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చా రు. ప్రతిపక్ష పార్టీ అయిన జగన్మోహన్ రెడ్డి వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని మాలల ఓట్లతో గతంలో అధికారంలోకి వెళ్లిన జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు ముఖం చాటేశారని విమర్శించారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘాల అధ్యక్షులు, ఎస్సీ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, జేఏసీ గౌరవ సలహాదారులు సంతోష్ కుమార్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పంతగాని రమేష్, డాక్టర్ సుబ్బారావు ,కొట్నేశ్ ,పంతగాని వెంకన్న, దుర్గారావు, రాజ్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మాలలు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా డాక్టర్ నాగార్జున



**పెన్ పవర్ గోపాలపురం నవంబర్ 10 :**రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా పశ్చిమగోదావరి జిల్లా తరపున తాడేపల్లిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పౌరశాస్త్ర అధ్యాపకునిగా పనిచేస్తున్న డాక్టర్ పివి నాగార్జున ఎంపిక అయినట్లు ఆయన విలేకరులకు తెలిపారు. ఉత్తమ సేవలు అందించినందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అధ్యాపకులను ఎంపిక చేస్తుందని అన్నారు. తాను పౌరశాస్త్రాన్ని బోధించడంతోపాటు జాతీయ సేవా పథకం ప్రత్యేక అధికారిగా పనిచేసి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టానన్నారు. అంతేకాక ఆన్లైన్ ద్వారా విద్యార్థులకు పాఠాలు బోధించే వాడిని అన్నారు. కళాశాలలో చదువుకునే విద్యార్థులకు వివిధ రకాల పోటీ పరీక్షలపై అవగాహన కల్పించేవారని పేర్కొన్నారు. తన వద్ద విద్యను అభ్యసించిన ఎందరో విద్యార్థులు విద్య ఉద్యోగ పరంగా ఎంతో ఉన్నతమైన స్థితిలో ఉన్నారన్నారు. విద్యార్థులకు పాఠాలు బోధించడమే కాకుండా క్రమశిక్షణ మానసిక ధైర్యం వంటి వాటిపై వారికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇటువంటి సేవలను గుర్తించిన ప్రభుత్వం తనకు రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపిక చేసిందని నాగార్జున తెలిపారు. ఆయనకి ఈ అవార్డు రావడం పట్ల తాడేపల్లిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధాన అధ్యాపకురాలు కె. నాగవేణి, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

## చెముడులంకలో వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ



**ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 10:**ఆలమూరు మండలం చెముడులంకలో అయ్యప్ప స్వామి పడిపూజ ఘనంగా జరిగింది. ఆ గ్రామ ధనలక్ష్మి అమ్మవారి ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ మున్నంగి ప్రభాకరశర్మ మొదటిసారి శబరిమల యాత్ర చేపడుతున్న సందర్భంగా గణపతి హెూమం, అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమాలను నిర్వహించారు. అరటి డొప్పులు,పువ్వులు,పండ్లతో అద్భుతంగా నెమలి ఆకారంలో వేదికను ముస్తాబు చేసి అందులో వినాయకుడు,అయ్యప్పస్వామి,కుమారస్వామి వారి చిత్రపటాలను ఏర్పాటు చేసి గారపాటి శివన్నారాయణ స్వామి ఆద్వర్యంలో పడిపూజను నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్ప అనే శరణఘోషలతో మారుమ్రోగింది. మణికంఠ శర్మ మంత్రోచ్చారణలతో కలశ పూజలు జరిపారు. ఈ సందర్భంగా పలువురు స్వాముల భజన పాటలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పలు పీఠాలకు చెందిన గురు స్వాములు చెల్లుబోయిన సత్యనారాయణ గురు స్వామి, కూసు శ్రీనివాస్ గురు స్వామి లతో పాటు దీక్ష చేపట్టిన అయ్యప్ప స్వాములు, శివ దీక్ష చేపట్టిన వారు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు విద్యార్థులు ఎంపిక



**ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 10:**ఈనెల 24వ తేదీన రామచంద్రపురంలో జరగనున్న రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు మదర్ తెరెసా స్పోర్ట్స్ అండ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు ఎంపికైనట్లు ఆ సంస్థ గ్రాండ్ మాస్టర్ టి అబ్బులు తెలిపారు. ఫైటర్స్ వివరాలు ప్రకారం బ్రౌన్ బెల్ట్ విభాగంలో బుంగ అశ్విన్, ఖండవిల్లి మహిమాకర్, అలాగే బ్లూ బెల్ట్ విభాగంలో గెద్దాడ జయ కిరణ్,జి షణ్ముఖ,అలాగే గ్రీన్ బెల్ట్ విభాగంలో కట్టా అనుశ్రీకార్తికేయ, వడ్డి గిరిజ,అలాగే ఎల్లో బెల్ట్ విభాగంలో వడ్డి కార్తికేయ, గెద్దాడ హర్షినిలు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులను సీనియర్ మాస్టర్స్ లంకే వెంకటరెడ్డి,నార్గాని చంద్ర కుమార్,టి వెంకటలక్ష్మి, కోచస్ టీ ఎల్ సందీప్ కిరణ్, మెరిపే సత్య కాంత్ తదితరులు అభినందించారు.

## రాష్ట్ర ఉత్తమ అధ్యాపకునిగా రామచంద్రరావు

**గోపాలపురం/నారాయణపురం పెన్ పవర్ నవంబర్ 10**



రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల పౌర శాస్త్ర అధ్యాపకులు సిహెచ్.వి.వి రామచంద్రరావు ఎంపికయ్యారు. ప్రతి ఏటా సెప్టెంబర్ 5 గురుపూజ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ఉత్తమ అధ్యాపకులను ఎంపిక చేయడం ఆనవాయితీ. అయితే ఏలూరు జిల్లా తరఫున రామచంద్రరావు ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ కళాశాల అభివృద్ధి ఉత్తమ ఫలితాల సాధన విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి కృషి వంటి వాటికి విశేషంగా కృషి చేసినందుకుగాను ఈ పురస్కారానికి ఎంపికయ్యారన్నారు. పదవ తరగతి చదివిన విద్యార్థుల ఇండ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ఎక్కువమంది విద్యార్థులను కళాశాలలో చేర్పించడానికి తోటి సహచరులతో కలిసి విశేషంగా పనిచేసానన్నారు. రామచంద్రరావు గతంలో తాడేపల్లిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ గా దిగ్విజయంగా పదవి బాధ్యతలు చేశారు. అలాగే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు నిడదవోలు లలో ఏర్పాటు చేసిన మూల్యాంకన కేంద్రాలలో ప్రముఖ పాత్ర వహించి మూల్యాంకనం సచావుగా జరగడానికి తన వంతు సహాయ సహకారాలు అందించారు. ఇటువంటి వ్యక్తి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్,తోటి అధ్యాపకులు బివి శ్రీనివాస్,జ్యోత్స్న,హేమ,రమేష్,వెంకటేశ్వరరావు,నాయుడు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## ట్రాక్టర్ బోల్తా నలుగురు కూలీలకు గాయాలు-ఎస్ఐ సతీష్





**గోపాలపురం, పెన్ పవర్, నవంబర్ 10:**గోపాలపురం గ్రామ శివారులో పొగాకు బోర్డు సమీపంలో ఆదివారం ఉదయం ట్రాక్టర్ బోల్తా పడడంతో నలుగురు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. గోపాలపురం ఎస్ఐ కె సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం నియోజకవర్గంలోని నల్లజర్ల మండలం అనంత పల్లి గ్రామానికి చెందిన కౌజులూరి ఏడుకొండలు, పసివేదల కోటయ్య, పసివేదల గణేష్, కలిదిండి బుల్లబ్బాయి అనేవారు ట్రాక్టర్ పై గోపాలపురం మండలం వేళ్ళ చింతల గూడెం వెళు తున్నారు. అక్కడ ఉన్న పాత చిన్న పెంకునుట్రాక్టర్ పై ఎగుమతి చేయడానికి ఈ నలుగురు ట్రాక్టర్ ట్రక్కులోకూర్చుని వెళుతున్నారు. డ్రైవర్ మితిమీరిన వేగంతో ట్రాక్టర్ నడిపి అదుపు చేయలేకపోవడంతో రోడ్డు పక్కనే ఉన్న ముళ్ళ పొదల్లోకి దూసుకుపోయి తిరగబడిపోయింది. విషయం తెలుసుకున్న జాతీయ రహదారి పర్యవేక్షణ పోలీసులు క్షతగాత్రులను పోలీసు వాహనంలో గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. బాధితులు ఏడుకొండల ఫిర్యాదు మేరకు వాహనాన్ని అజాగ్రత్తగా నడిపిన డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అరుంధతి ఉద్యోగుల ఔదార్యం



**పెన్ పవర్ గోపాలపురం నవంబర్ 10 :**ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం కనీస మానవ ధర్మం అని నిరూపిస్తున్నారు అరుంధతి ఉద్యోగుల సంఘ సభ్యులు. మండలంలోని వాదాలకుంట గ్రామానికి చెందిన ఒక మహిళ ప్రాణాంతక వ్యాధితో బాధపడుతూ శస్త్రచికిత్స చేయించుకున్నారు. అలాగే కొయ్యలగూడెం మండలం కన్నాపురం గ్రామానికి చెందిన దంపతులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. తలకు దెబ్బ తగలడంతో ప్రస్తుతం కాకినాడ ప్రభుత్వాసుపత్రులో వైద్యం పొందుతున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా అరుంధతి ఉద్యోగ ఉపాధ్యాయ ఫెడరేషన్ సభ్యులు బాధితుల ఇరువురికి ఒక్కొక్కరికి 6000 రూపాయలు చొప్పున మందుల ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో కెవివి.సత్యనారాయణ ,బి. మధు శేఖర్, ఎం. జలమయ్య, సిహెచ్. రామారావు, సిహెచ్. బాబురావు, సిఆర్పి కొయ్య నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆన్లైన్ రుణాలపై,అవగాహన కార్యక్రమం..



**దేవీపట్నం,పెన్ పవర్,నవంబర్10:** గ్రామాలలో ప్రజలకు కొన్ని ముఖ్యమైన విషయాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజల వాటిని తప్పక పాటించాలని ఎస్ఐ షరీఫ్ అన్నారు. ఆదివారం దేవీపట్నం మండలం ఇందుకూరుపేట గ్రామంలో ప్రజలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ,ప్రజలు కొన్ని విషయాల్లో చాలా జాగ్రత్తలు పాటించాలని,బ్యాంక్ అకౌంట్ కు సంబంధించిన విషయాలు ఎవరికీ చెప్పకూడదని సూచించారు.ఆన్లైన్లో వచ్చే లింకులు క్లిక్ చేసి ఇబ్బందులకు గురి కాకూడదని చెప్పారు.రుణాల పేరుతో మోసపోవద్దని,ఎవరికైనా ఆన్లైన్ రుణాల బారినపడి ఇబ్బందులు పడుతుంటే పోలీసుల దృష్టికి తీసుకు రావాలని తెలిపారు.వాహనాలపై ప్రయాణించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని,మద్యం సేవించి వాహనాలు నడపడం,మితిమీరిన వేగంతో నడపడం వంటివి చేయకూడదని సూచించారు. వన్యప్రాణుల కోసం విద్యుత్ వైర్లు ఏర్పాటు చెయడం చాలా ప్రమాదకరమైన విషయం అని,దీనివల్ల వన్యప్రాణులు ప్రాణాలతో పాటు మనుషులు ప్రాణాలు పోతున్నాయని అన్నారు. ఈ విషయంలో చాలా కఠినమైన కేసుల్లో ఇరుక్కునే అవకాశం ఉందని, ఎవరు అటవీ ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు పెట్టకూడదని సూచించారు.

## ఘనంగా కార్తీకవన సమారాధన.





**కాకినాడ.పెన్ పవర్ నవంబర్ 10 :** కాకినాడ రూరల్ శాసన సభ్యులు, జనసేన పార్టీ పీఏసీ సభ్యులు పంతం నానాజీ ఆధ్వర్యంలో జనసేన పార్టీ క్రియశిలక సభ్యులు,కూటమి నాయకుల కుటుంబాలు,తెలుగుదేశం,బీజేపీ శ్రేణులతో 4వ కార్తీక వన సమారాధన మహెూత్సవం కాకినాడ రూరల్ కిరణ్ కంటి ఆసుపత్రి సమీపంలో గల మామిడి తోటలో జరిగింది.ఈ ఆత్మీయ సమావేశ వనసమారాదనలో సుమారు 25వేల మంది పాల్గొన్నారు. ఉదయం పూజ కార్యక్రమం తో మొదలై,ఆట పాటలతో,అతిధుల ప్రసంగాలతో, ఎంతో ఘనంగా జరిగింది, విజేతలకు ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్, మైక్రో వేవన్ తదితర బహుమతులను అతిదుల చేతులమీదుగా విజేతలకు అందించారు.ఈ కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి శుభాష్ ,శాసన సభ్యులు, వరుపుల సత్య ప్రభ , వనమాడి కొండబాబు తెలుగుదేశం ,నాయకులు పేరాబత్తులరాజశేఖర్,ఎస్వీఎస్ఎన్.వర్మ, పిల్లి అనంత లక్ష్మి, చిక్కాల రామచంద్ర రావు బీజేపీ,జనసేన నాయకులు శ్రేణులు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## ఈనెల 12న జరిగే దండోరా సమావేశాన్ని జయప్రదం చేయాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు. చిన్న బాబు




**గంగవరం,పెన్ పవర్, నవంబర్10:**
దండోరా ఉద్యమకారుడు అభినవ అంబేద్కర్ మందకృష్ణ మాదిగ ఆదేశాల అనుసరించి ఈనెల 12వ తేదీన రాజవొమ్మంగి లో జరిగే దండోరా సమావేశానికి మాదిగ సోదరులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు నిడమర్తి చిన్నబాబు పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ అనుకూలంగా సుప్రీంకోర్టు నందు తీర్పు వచ్చిన సందర్భంగా రాష్ట్రంలో అన్ని జిల్లాల లో తీర్పు యొక్క సారాంశాన్ని భవిష్యత్తు ప్రణాళికను గూర్చి సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించడం జరిగిందన్నారు . ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాజవొమ్మంగి లో ఈ నెల 12వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు జిల్లా సమావేశం నిర్వహిస్తున్నట్లు, .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా ఉత్తర కోస్తా,ఆంధ్ర జిల్లాల ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి , కన్వీనర్ ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు మాదిగ, పాల్గొంటారని తెలిపారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు అల్లూరి జిల్లా లో డివిజన్, మండల, గ్రామస్థాయి లోగల మాదిగ , మాదిగ ఉప కులాలు కు చెందిన ప్రతి ఒక్కరు పాల్గొనాలనికోరారు. ఏబిసిడి వర్గీకరణ వల్ల ఏజెన్సీలో మాదిగలకు రాజ్యాంగంలో పొందుపరచిన హక్కులు ఏ విధంగా పొందాలి అనే విషయంపై ఈ సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు.

# తలసేమియా చిన్నారులకు రక్తదానం చేసి అండగా నిలవండి

- డా.చేయూత రవి పిలుపు



**కాకినాడ.పెన్ పవర్ నవంబర్ 10 :** బాలల దినోత్సవం పురస్కరించుకుని చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారులకు అండగా ఉండాలనే ఉద్దేశంతో రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ నందు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏ. సత్యనారాయణ సీపీఐ పార్టీ ప్రధాన కార్యదర్శి అంబేద్కర్ కోనసీమ జిల్లా, రెడ్ క్రాస్ చైర్మన్ వై డి రామారావు,పూర్వపు కాకినాడ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి కె. వి. వి. సత్యనారాయణ మండల విద్యాశాఖాధికారులు శ్రీమతి కె. బి కృష్ణవేణి, పత్తి సత్యనారాయణ, చెవ్వూరి రవి, పైడిరాజు, వేణుగోపాల్, సి. వి. వి. సత్య నారాయణలు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చేయూత అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్ అలీమ్ లు మాట్లాడుతూ సమాజంలో ఆపద సమయాలలో సమయానికి రక్తం అందక ఎంతో మంది క్షతగాత్రులు ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందని, ఇటువంటి ఆపన్నులు ఎవరూ కూడా రక్తం అందక ఇబ్బంది పడకుండా ఉండాలంటే యువత అందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలన్నారు. అదే విధంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులు 153 మంది వరకూ ఉన్నారని వారికి వారికి ప్రతి 21 రోజులుకు ఒకసారి రక్తం ఎక్కించాల్సి ఉండగా రెడ్ క్రాస్ సంస్థ వారు ప్రతి మంగళ, శుక్ర వారాలలో ఉచితంగా రక్తం ఇవ్వడమే కాకుండా ఎక్కించడం కూడా జరుగుతుందని తెలియజేశారు. రెడ్ క్రాస్ వారు చేస్తున్న ఈ బృహత్ కార్యక్రమానికి తోడ్పాటుగా మన చేయూత సంస్థ బాలల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగ మహిళలు స్వాతి, పోసమ్మ, గోపి, సత్యన్నారాయణ రక్తదానం చేసి పలువురికి స్ఫూర్తిగా నిలిచారు. అనేక మంది ఉపాధ్యాయులు, యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేయడం జరిగింది. చేయూత ఆర్థిక కార్యదర్శి చింతా నారాయణ మూర్తి మాట్లాడుతూ చిన్నారి అనూష గుండె ఆపరేషన్ కోసం సేకరించిన లక్ష రూపాయలు విజయవాడ వెళ్లి అందజేయడం జరుగుతుందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో చేయూత బ్లడ్ విభాగం చైర్మన్ ఎ. వి. శ్రీనివాసరావు కాకినాడ జిల్లా చేయూత అధ్యక్షురాలు సురభి శారద ,అంగాడ లక్ష్మి, గీసాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాదిగల ఆత్మ గౌరవ జెండా ఆవిష్కరణ...






**ఆలమూరు,పెన్ పవర్, నవంబర్ 10:** ఆలమూరు మండలంలోని గుమ్మిలేరు గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మాదిగల ఆత్మ గౌరవ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు బుంగ సంజయ్ మాదిగ,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఎం.రమేష్ మాదిగలు ముఖ్య అతిథులుగా పాల్గొని జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగలు గడిచిన మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కొరకు అలుపెరుగని పోరాటం చేశారని,వారి గోడును కేవలం తెదేపా అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు మాత్రమే గ్రహించి ఇటీవల వర్గీకరణ చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. ప్రస్తుతం దీనిపై మాల సోదరులు సుప్రీం కోర్టులో పిటిషన్ వేయడంతో వర్గీకరణ నిలుపుదల చేశారన్నారు. అయితే మాదిగలు కోరుకున్న వర్గీకరణ న్యాయమైన డిమాండ్ కావడంతో వాస్తవాన్ని తెలుసుకున్న కూటమి ప్రభుత్వం సహకారంతో దేశ అత్యున్నత న్యాయస్థానం కూడా వర్గీకరణకు అనుకూలంగా తీర్పునివ్వడంతో వర్గీకరణకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయన్నారు. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం స్పందించి దీనిపై ప్రత్యేక కమిటీని నియమించి నెలరోజుల్లో నివేదిక ఇచ్చి జిల్లాను ఒక యూనిట్ గా చేసి దామాషా ప్రకారం వర్గీకరణను అమలు చేసేంతవరకు ఏవిధమైన ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని ఆదేశించిన రాష్ట్ర ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా మాదిగ కార్పొరేషన్ ద్వారా మాదిగలకు రుణాలను వీలైనంత తొందరగా మంజూరు చేసి మాదిగల ఆర్థిక ప్రగతికి తోడ్పడాలని కోరారు. అంతేకాకుండా ప్రస్తుతం అమలవుతున్న రిజర్వేషన్లను ప్రభుత్వరంగంతో పాటు ప్రైవేటు రంగంలో కూడా అమలయ్యే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ఎస్ గౌరవ సలహాదారులు మల్లిపూడి జగ్జీవన్ మాదిగ,మాదిగ ఉద్యోగుల సంఘు రాష్ట్ర అధ్యక్షుడు సొంగ ప్రసాద్ మాదిగ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బజ్జంగి సుధాకర మాదిగ, యువసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.నికోలస్ రాజు,ఎం.ఎస్.ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బి.సునీల్ దత్తు,రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ మేరీ,కోనసీమ జిల్లా గౌరవ అధ్యక్షులు కొల్లి శ్యాంసన్, కోనసీమ జిల్లా అధ్యక్షుడు సిర్రా శ్రీను,తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుకూరి రాజు, కాకినాడ జిల్లా ఇంచార్జ్ తాతపూడి మూర్తి ,తూర్పు గోదావరి జిల్లా యువసేన అధ్యక్షుడు కొడమంచిలి సూర్య ,నంద్యాల జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు చింతిరాల మీరయ్య మాదిగ,కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గిడ్డయ్య,పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు సిర్రా బ్రహ్మయ్య, కోనసీమ జిల్లా గౌరవ సలహాదారు ముమ్మిడివరపు త్రిమూర్తులు మాదిగ,కోనసీమ జిల్లా అధికార ప్రతినిధి మందపల్లి శ్రీను,కోనసీమ జిల్లా యువసేన ఉపాధ్యక్షుడు సెలగల వెంకటేష్,ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ శీలి దశరాజు, పల్లేటి సతీష్ మాదిగ,చిర్రా శ్రీనివాస్, లంక కృష్ణ,లంక రాజు,కొమ్ము సతీష్,కోట విజయ్ కుమార్,యార్లగడ్డ అశోక్,యార్లగడ్డ చిట్టిబాబు,తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో మొట్టమొదటిగా రాష్ట్రస్థాయి చెస్ పోటీలు.






**రాష్ట్రస్థాయి చెస్ అసోసియేషన్ సెక్రెటరీ కవుది జగదీష్ ఆధ్వర్యంలో.**

**అమలాపురం, టౌన్ పెన్ పవర్, నవంబర్ 10:**
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మొట్టమొదటి సారి గా 2024వ సంవత్సరం లో ఐదు లక్షల రూపాయల ప్రైజ్ మనీ తో రాష్ట్రస్థాయి చెస్ అసోసియేషన్ సెక్రటరీ కవురి జగదీష్ ఆధ్వర్యంలో ఏపీ స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ కిమ్స్ ఆడిటోరియంలో జరిగే చెస్ పోటీలను అమలాపురం నియోజకవర్గం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు ప్రారంభించారు. జిల్లాలో రాష్ట్రస్థాయిలో జరిగే చెస్ టోర్నమెంట్ కు 24 జిల్లాల నుండి సుమారుగా 200 మంది క్రీడాకారులు కి పైగా పాల్గొనగా ఈ పోటీలలో జాతీయ స్థాయి క్రీడాకారులు, రాష్ట్రపతి అవార్డు పొందిన క్రీడాకారులు, ఈ చెస్ పోటీలలో పాల్గొన్నారు
ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మధూర్ చే ట్రోఫీ మరియు ప్రైజ్ మనీ అందించారు.
ఈ సందర్భంగా ఎంపీ హరీష్ బాలయోగి మాట్లాడుతూ
క్రికెట్, చెస్, స్విమ్మింగ్ ఇతర క్రీడాకారులను ప్రోత్సహించడానికి అన్ని విధాల కేంద్రం మరియు రాష్ట్ర ప్రభుత్వ నాయకులు,అధికారులతోనూ మాట్లాడతానని తగిన విధంగా రాబోయే రోజుల్లో క్రీడాకారులు అన్ని విధాలుగా వసతులు కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ నుండి ఇతర దేశాలకు పంపించి మన దేశంలో క్రీడాకారులు తలెత్తుకునేలా చేస్తామని ఎంపీ తెలిపారు
అలాగే కవురు జగదీష్ మాట్లాడుతూ
అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ బాలయోగి మరియు కిమ్స్ యాజమాన్యం వారి సహాయ సహకారాలతో ఘనంగా నిర్వహించామని ఎంపీ హరీష్ మాధుర్ కి , కిమ్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు పిలవగానే వచ్చి కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మెల్యే ఆనందరావుకి మెట్ల రమణబాబు కి కూడా కృతజ్ఞతలు తెలిపారు అన్ని జిల్లాల నుంచి క్రీడా పోటీలకు విచ్చేసిన క్రీడాకారులకు మరియు తల్లిదండ్రులకు సహకరించిన అందరికీ జగదీష్ కృతజ్ఞతలు తెలిపారు



ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చెస్ అసోసియేషన్ చైర్మన్ కె వి బి శర్మ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అసోసియేషన్ సెక్రటరీ తాడి సురేష్, చెస్ అసోసియేషన్ సీఈవో జ్వాలాముఖి, అసోసియేషన్ మెంబర్ ముషిణి మురళీధర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జిపిఆర్ లేఅవుట్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు.

- అధ్యక్ష కార్యదర్శులుగా భాస్కర్, నాగార్జునరావు.

**లంకెలపాలెం ( పెన్ పవర్ )నవంబర్ 10:** లంకెలపాలెంలో గల శ్రీ కనకదుర్గానగర్ (జిపిఆర్) లే అవుట్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ మీటింగ్ ఆదివారం జరిగింది. ఇప్పటివరకు ఉన్న కమిటీ మెంబర్స్ ని వారి సేవలను అందరూ మెచ్చుకొని ఈరోజు నూతన కార్యవర్గమును ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యవర్గంలో అధ్యక్షులుగా కే .భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా, కే. నాగార్జున రావు, ఉపాధ్యక్షులు డాక్టర్ సిహెచ్ రామారావు , ట్రెజరర్ ఎ .సత్తిబాబు, జాయింట్ సెక్రటరీ బివిఎస్ పోల రావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా ఎ .రమణ, జి. రామునాయుడు, కే .రామకృష్ణ, కే. శ్రీనివాస్, సిహెచ్. గోపి, లను, ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశానికి జి.పి.ఆర్ లే అవుట్ ప్లాట్ ఓనర్స్ అధిక సంఖ్యలో పాల్గొని వారి సలహాలు ఇవ్వడం జరిగింది. రానున్న రోజులలో డెవలప్మెంట్ చేయడానికి అన్ని విధాల కృషి చేస్తామని నూతన కార్యవర్గం తీర్మానించింది.




నూతన కమిటీని ఎన్నుకుకమిటీ న్నందుకు సభ్యులందరికీ, కమిటీ ధన్యవాదాలు తెలియజేశారు.

## మండల పరిషత్ నిధుల దుర్వినియోగంపై సమగ్ర దర్యాప్తు

- ఉమ్మడి విశాఖ జిల్లాల సీఈవో నారాయణమూర్తి
- దర్యాప్తు అధికారిగా డిప్యూటీ సీఈఓ రాజకుమార్ నియామకం

**గూడెం కొత్త వీధి పెన్ పవర్ నవంబర్ 10:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని మండల ప్రజా పరిషత్ నిధులు భారీ ఎత్తున దుర్వినియోగం జరిగాయని దీనిపై సమగ్ర విచారణ జరపాలంటూ వివిధ పత్రికల్లో వచ్చిన వార్తలకు ఉమ్మడి విశాఖ జిల్లాల జిల్లా పరిషత్తు సీఈవో నారాయణమూర్తి స్పందించారు.ఈ మేరకు 2021 నుండి 2024 వరకు మండల ప్రజా పరిషత్ కు వచ్చిన నిధులు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు నిధుల వినియోగం పై సమగ్ర దర్యాప్తు చేసి అల్లూరి జిల్లా కలెక్టర్ కు నివేదిక అందజేస్తామని ఆయన తెలిపారు.ఈ మేరకు ఉమ్మడి విశాఖ జిల్లాల జిల్లా పరిషత్తు డిప్యూటీ సీఈవో రాజ్ కుమార్ ను విచారణ అధికారిగా నియమించామని ఆయన పేర్కొన్నారు.2021 నుండి 2024 వరకు మండల ప్రజా పరిషత్ కు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు భారీ ఎత్తున పనులు చేపట్టకుండానే స్వాహా చేశారని పలువురు ప్రజాప్రతినిధులు ఆరోపించిన నేపథ్యంలో జడ్పీ సీఈవో నారాయణమూర్తి స్పందించి వెంటనే విచారణకు ఆదేశాలు జారీ చేశారు.కాగా డిప్యూటీ సీఈవో రాజకుమార్ విచారణ రిపోర్టు అందిన వెంటనే దానిని అల్లూరి జిల్లా కలెక్టర్ కు చర్యలు నిమిత్తం అందజేస్తామని జెడ్పి సీఈఓ తెలిపారు.

## మత్స్యగెడ్డలో మరణించిన వ్యక్తి కుటుంబానికీ పరామర్శ

–ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లి పల్లి సుభద్ర.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, నవంబర్ 10.**మండలంలో గల సుజనకోట పంచాయతీ గొడుగులపుట్టు గ్రామస్తుడు పనసగుడియ సోమ్రాన్న చేపల వేటకు వెళ్లి పడవ ప్రమాదంలో చనిపోయిన ఘటన తెలిసిందే. ఆదివారం జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర, వైసిపి నాయకులు మృతుని సతీమణి పనసాగుడియ రంభకు వారి కుటుంభసభ్యులకు పరామర్శించారు. కుటుంబానికి వైసిపి తరుపున అండగా ఉంటామని, ఏ సమస్య వచ్చిన తమను సంప్రదించాలని భరోసానిచ్చారు.ఈ కార్యక్రమంలో పెదగూడ సర్పంచ్ మండి బాబురావు, ఎంపీటీసీ గణపతి, సుజనకోట ఎంపీటీసీ మజ్జి సుబ్బలక్ష్మి, జోలపుట్టు ఎంపీటీసీ కమల, సర్పంచ్ల ఫోరమ్ రమేష్, అల్లూరి జిల్లా వైసిపి ప్రధానకార్యదర్శి జగబందు, బుద్ధ, జగన్నాధం,దాసు, వార్డుమెంబర్లు, ఉపసర్పంచ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా పెద గొలుగొండపేటలో జనసేన జెండా పాతిన జన సైనికులు......



- జనసేన జెండాను ఆవిష్కరించిన ఇంచార్జ్ సూర్య చంద్ర,కౌన్సిలర్ సౌజన్య,అద్దేపల్లి గణేష్.....
- రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న నాయకుడు పవన్ కళ్యాణ్...
- జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ సూర్య నమస్కారం చంద్ర....



**నాతవరం, పెన్ పవర్ (నవంబర్ 10):** మండలంలో గల చిన గొలుగొండపేటలో గ్రామ నాయకులు బాలరాజు ఆధ్వర్యంలో ఆదివారం జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర ముఖ్య అతిధిగా హాజరై జెండా ఆవిష్కరించి మాట్లాడారు.గడిచిన ఎన్నికల్లో జనసేన ప్రభంజనం చూశారని చెప్పారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. గ్రామగ్రామాన జనసేన పార్టీ బలోపేతం అయిందన్నారు. రానున్న రోజుల్లో గ్రామీణ స్థాయిలో పార్టీని మరింత ముందుకు తీసుకు వెళతామన్నారు. జనసేన పార్టీ నర్సీపట్నం మున్సిపాలిటీ కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. గతంలో ఎప్పుడు లేని విధంగా గ్రామీభివృద్ధి జరుగుతుందని చెప్పారు.జనసేన పార్టీ 2014లో ప్రజాస్వామ్యంలో జరిగే సమస్యలను ప్రశ్నించటానికి పవన్ కళ్యాణ్ స్థాపించారని మండల జనసేన పార్టీ అధ్యక్షులు వెలగల వెంకటరమణ అన్నారు.ప్రజాసైన్యం తో నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడుతూ 2024 ఎన్నికలలో ముఖ్య భూమిక పోషించి జనసేన పార్టీ జెండా తన సత్తా ఏంటో చూపించింది.జనసేన అంటే ప్రజా సైన్యం అని అర్థమని తెలిపారు. అటువంటి జెండా ఆవిష్కరణ ఈ గ్రామంలో జరగడం ఆనందంగా ఉందన్నారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ ఆశయాలను, లక్ష్యాలను ఇంకా ప్రజల్లోకి బలంగా తీసుకెల్లాలని కోరుచున్నానన్నారు. కార్యకర్తలకు ప్రజలకు ఏ సమస్య ఉన్న జనసేన పార్టీ అండగా ఉంటుందన,ఈ సభాముఖంగా తెలియ చేస్తున్నామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మున్సిపాలిటీ జనసేన పార్టీ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, అంకం రెడ్డి నాయుడు,పైల రమణ,దోమల మణికంత,చింతకాయల బాలరాజు,జనసేన మండల యువ నాయకులు మురళి, ప్రగడ కృష్ణ, మాకిరెడ్డి వెంకటరమణ, టిడిపి యువ నాయకులు చిట్టిబాబు,దొరబాబు తదితరులు పాల్గొన్నారు.








## కోరమండల్ సి.ఎస్ ఆర్ నిధులతో నిర్మించిన



- నూతన సామాజిక భవనం ప్రారంభోత్సవం
- ముఖ్యఅతిథి పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు



**ములగాడ, పెన్ పవర్, నవంబర్ 10 :**జీ.వీ.ఎం.సీ పరిధి పశ్చిమ నియోజకవర్గం 58 వ వార్డు కుంచాలమ్మ కాలనీలో కోరమండల్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ వారి సి.ఎస్ ఆర్. నిధులతో నిర్మించిన సామాజిక భవనాన్ని ఆదివారం ముఖ్య అతిథిగా పశ్చిమ నియోజక వర్గ శాసనసభ్యులు గణబాబు చేతుల మీదుగా ప్రారంభించారు, అనంతరం గణబాబు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కోరమండల్ యాజమాన్యం కోరమండల్ యాజమాన్యం వైస్ ప్రెసిడెంట్ జ్ఞాన సుందరం, రెడ్డిపల్లి శ్రీనివాస్ డీ.జీ.ఎంహెచ్ ఆర్ శ్రీనివాస్, సేఫ్టీ హెడ్ నాగరా జు, సి ఎస్.ఆర్ డిప్యూటీ మేనేజర్ రమణ మరియు తెదేపా నాయకు లు,టి.డి.పి మాజీ కార్పొరేటర్ సీరం ఉమామ హేశ్వరి, 58 వ అధ్యక్షులు కోరాడ శ్రీనివాసరా వు, వార్డు ప్రధాన కార్యదర్శి పోతాబత్తుల శ్రీని వాస్, శివారెడ్డి ,రాజేష్ రెడ్డి, రమణ, సుజాత, నాని,కామేష్,భవాని, తదితరులు పాల్గొన్నారు




## జీవో నెం.3 కై పోరాడాల్సిన బాధ్యత గిరిజన ఎమ్మెల్యేలుదే...!

- ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు దర్శి సతీష్



**కొయ్యూరు, పెన్ పవర్ నవంబర్ 10:** ఎన్నికల ముందు అరకు వేలి విచ్చేసిన అప్పటి ప్రతిపక్ష నేత ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు జీవో నెం.3 ని పునరుద్ధరించాలని ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు దర్శి సతీష్ కోరారు. ఆదివారం సిపిఐ మండల కార్యదర్శి ఇరువాడ దేవుడు, గిరిజన సమాఖ్య మండల కార్యదర్శి పోటుకూరి దారమల్లేశు, మాజీ సర్పంచ్ గుమ్మ రాంబాబు, ఇరువాడ రాజబాబు లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ – జీవో నెంబర్ 3 కై పోరాడాల్సిన బాధ్యత గిరిజన ఎమ్మెల్యేలపై ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. జీవో నెంబర్ 3 ని ఇటీవల సుప్రీంకోర్టు రద్దు చేయడం వలన విద్యాభ్యాసం చేసిన ఎంతోమంది గిరిజన నిరుద్యోగులకు నష్టం కలుగుతోందని, దేశంలోని 192 ఐటీడీఏ పరిధిలో బీఈడీ, డిఈడి చేసిన గిరిజన నిరుద్యోగులకు ఈ రద్దు ఎంతో నష్టాన్ని చేకూర్చుతుంది అన్నారు. ప్రతి ఐటీడీఏ పరిధిలోని ఉపాధ్యాయ పోస్టులను స్పెషల్ డిఎస్సీ ద్వారా గిరిజనులకే కేటాయించాలని ఆయన కోరారు. స్పెషల్ డిఎస్సీ రద్దు ద్వారా గిరిజనులకు నష్టం వాటిల్లుతుందన్నారు. ప్రస్తుతం అసెంబ్లీలో ఉన్న ఏడుగురు గిరిజన ఎమ్మెల్యేలు జీవో నెంబర్ 3కై పోరాడాలని ఆయన డిమాండ్ చేశారు.

## అయ్యవారు ఆదేశించిన... కాంట్రాక్టర్ కనికరించలేదు...!

- కలెక్టర్ నిధులిచ్చినా కాంట్రాక్టర్ రోడ్డుపని మొదలెట్టలేదని గిరిజనుల ఆవేదన



**కొయ్యూరు, పెన్ పవర్ నవంబర్ 10:**తమ పరిస్థితి 'దేవుడు వరమిచ్చినా , పూజారి కనికరించని' చందంగా ఉందని మండలంలోని తీగల మెట్ట గ్రామ గిరిజనులు వాపోతున్నారు. ఆదివారం వారు స్థానిక విలేకరులకు పంపిన ఒక ప్రకటనలో ఇలా ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి రోడ్డు లేదని పలుమార్లు ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించిన దరిమిలా సుమారు నెల 15 రోజుల క్రితం తమ గ్రామ రోడ్డు నిర్మాణానికి జిల్లా కలెక్టర్ రూ. 40 లక్షల నిధులు మంజూరు చేశారని, అయితే రోజులు గడుస్తున్నా సరే కాంట్రాక్టర్ ఇంకా రోడ్డు పని ప్రారంభించలేదని, అడిగితే రేపు మాపు అంటూ వాయిదాలు వేస్తున్నారని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై స్థానిక మండల ఇంజనీరింగ్ అధికారులు స్పందించి తమ గ్రామానికి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని తీగల మెట్ట గ్రామ గిరిజనులు ప్రాధేయ పడుతున్నారు.

## ఘనంగా ప్రారంభించిన రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలు

- ప్రాతినిధ్యం వహించిన కణితి జిల్లా ప్రాథమిక పాఠశాల
- ముఖ్య అతిథిలుగా టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు,రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్






**గాజువాక: పెన్ పవర్, నవంబర్ 10**

గాజువాక నియోజకవర్గం 87 వార్డ్ పరిధిలో కణితి జిల్లా ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న 68వ రాష్ట్రస్థాయి అండర్ –14 నెట్ బాల్ పోటీలకు ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు గాజువాక నియోజకవర్గం శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలకు విశాఖ జిల్లా ప్రాతినిధ్యం వహించడం అందులో నా నియోజకవర్గం 87వ వార్డ్ లో ఉన్న కణితి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించడం చాలా ఆనందకరంగా ఉందని, పిల్లలు అందరు మంచి ప్రతిభ కనపరచాలని ఇంత మంచి కార్యక్రమంలో నన్ను భాగస్వామి చేసిన ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు మంచి సదుపాయాలు ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమం లో కళ్లేపల్లి శ్రీనివాసవర్మ, పావాడ రమణమూర్తి, జీవీ రమణ, పోతల కృష్ణ,కిరణ్, బలిరెడ్డి నాగేశ్వరరావు, హెడ్ మాస్టర్ సూర్య ప్రకాష్, మన్నాజీ, నారాయణరావు, ఉపాధ్యాయులు, పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రన్ ఫర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పోస్టర్ ఆవిష్కరణ.

- విశాఖ దక్షిణ ఎమ్మెల్యే, విశాఖ నగర జనసేన అధ్యక్షులు సి.హెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 10.** :రన్ ఫర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పోస్టర్ ఆవిష్కరించిన విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు మరియు విశాఖ నగర జనసేన అధ్యక్షులు సి.హెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఆలుమ్ని అసోసియేషన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆంధ్ర యూనివర్సి టీ విద్యార్థులు పరిశోధకులు బోధన మరియు బోధనేతర సిబ్బంది, అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ భీమ్ సేన వార్, టి.ఎన్.ఎస్.ఎఫ్.టి.ఎన్టి యు.సి డిహెచ్పిఎస్, దళిత, బీసీ, మైనారిటీ మరియు ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ విశాఖ దక్షిణ నియోజక వర్గ శాసనసభ్యులు మరియు విశాఖ నగర జనసేన అధ్యక్షులు సిహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించే రన్ ఫర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కార్యక్రమం ఉదయం 6 గంటల నుండి ఆర్కే బీచ్ ఎన్టీఆర్ విగ్రహం నుండి వై ఎం సి ఏ వరకు నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఆలుమ్ని అసోసియే షన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు ఆచార్య కోటి జాన్, సెక్రటరీ మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆరేటి మహేష్, ఆచార్య ఎం. రామకృష్ణ ఫిజిక్స్, డాక్టర్ బి. మోహన్ బాబు, ఏపీ నిరుద్యోగ పోరాట సమితి రాష్ట్ర అధ్య క్షుడు మర్రివేముల శ్రీనివాస్, డాక్టర్ సుధీర్, ఏ యు టి ఎన్ టి యు సి ప్రతినిధి ఆవాల రమేష్, డాక్టర్ సిహెచ్ ప్రసాద్, డాక్టర్ శిరీష్ కుమార్, డాక్టర్ విక్రమ్, డాక్టర్ సురేంద్ర, చొప్పర బ్రహ్మా య్య తదితరులు గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం లో పాల్గొన్నారు.నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆర్కే బీచ్ లో జరిగే రన్ ఫర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద యం 6 గంటల నుండి కార్యక్రమం ప్రారంభమ వుతుందని, ఈ కార్యక్రమంలో పాల్గొనే వారంద రికీ రిజిస్ట్రేషన్ ఉచితంతో పాటు హాజరైన ప్రతి ఒక్కరికి టీ షర్టు ఉచితంగా ఇవ్వబడుతుందని నిర్వాహకులు తెలియజేశారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ .జి.వి.ఎం.సి.

- నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి.
- జి.వి.ఎం.సి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమా ర్





**విశాఖ దక్షణం, పెన్ పవర్, విశాఖపట్నం, నవంబర్ 10** : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో, అన్ని జోనల్ కార్యాలయా లలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్ర మం" 2024 నవంబర్ 11 వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించబడునని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి,జి.వి. ఎం.సి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ పత్రికా ప్రకటన ద్వారా ఆదివారం తెలిపారు.
కావున,నగరంలో పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, మొక్కల విభాగం, రెవిన్యూ, యు సి డి, ఇంజినీరింగ్ మొదలగు జీ వీ.ఎం.సీ విభాగా లకు సంబంధించిన సమస్యలపై నగర ప్రజలు 11 వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంట ల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీల ద్వారా సమస్యలను తెలియపరుచుకో వచ్చునని నగర ప్రజలకు వారు తెలియచేశారు.

## "నేడు"జరగు మహాధర్నాను జయప్రదం చేయండి

- ఈ నెల 11న ఏఐటియుసి ఆధ్వర్యంలో జరుగు ధర్నాకు తరలి రండి
- ఏఐటీయూసీ ఆరిలోవ జోన్ గౌరవ అధ్యక్షులు పిల్లి వీర్రాజు





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం నవంబర్ 10** ఆరిలోవ జోన్ భవననిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 11న జీవీఎంసీ గాంధీ విగ్రహం దగ్గర జరిగే మహా ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ శివాజీ నగర్-2 (40 గజాలు) దగ్గర ఏఐటీయూసీ ఆరిలోవ జోన్ అధ్యక్షులు
పిల్లి వీర్రాజు భవన నిర్మాణ కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేసి భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారణ సాధనకు మహా ధర్నాకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.
ఈ కార్యక్రమంలో నాయకులు పి శ్రీనివాసరావు కరక రమణ, అశోక్,గణేష్,శివాజీ, అప్పారావు మధు పాల్గొన్నారు

# విశాఖ పోలీసులు వినూత్న చర్యలు




- ఓమ్ని హాస్పిటల్స్, వైజాగ్ పోలీస్ గాంధీ గిరి.
- ట్రాఫిక్ పోలీసులతో కలిసి ఓమ్ని హాస్పిటల్స్ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన
- నగరంలో మూడు చోట్ల ఎవేర్ నెస్ క్యాంప్స్
- వాహన చోదకులకు ఫ్రీ హార్ట్ హెల్త్ చెకప్ కూపన్ల పంపిణీ






**విశాఖ క్రైమ్ బ్యూరో పెన్ పవర్, విశాఖపట్నం నవంబర్ 10:** ఓమ్ని హాస్పిటల్స్ ఆధ్వర్యంలో సామాజిక భాధ్యతగా ఆసుపత్రి యాజమాన్యం పలు సామాజిక సేవా, అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా రహదారి భద్రత, నియమాలు, ప్రమాదాల నివారణపై నగర ట్రాఫిక్ పోలీసు విభాగంతో కలసి ఓమ్ని ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ప్రజలకు, వాహన చోదకులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది . సిరిపురంలోని వాల్తేరు క్లబ్, రామ్ నగర్ లోని నేతివిందు రెస్టారెంట్ ఎదురుగా, జగదాంబ జంక్షన్ క్లాక్ టవర్ ఎదురుగా మూడు చోట్ల గాంధీ గిరి పేరిట అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఓమ్ని ఆసుపత్రి సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులతో కలసి అటువైపుగా వెళుతున్న వాహన చోదకులకు హెల్మెట్ వినియోగం, సీట్ బెల్ట్ ఆవశ్యకత, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, పరిమితికి మించిన ప్రయాణికులతో వెళ్లడం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల జరిగే అనార్ధాలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు తూచ తప్పకుండా పాటించి ప్రమాదాలను నివారించాలన్నారు. విశాఖలో గత 11 ఏళ్లుగా అంతర్జాతీయ ప్రమాణాలతో ఓమ్ని హాస్పిటల్స్ వైద్య సేవలు అందిస్తున్నాయి. అన్ని సూపర్ స్పెషాలిటీ వైద్య విభాగాల్లో నిపుణులైన వైద్య బృందం అత్యుత్తమ చికిత్సను అందిస్తున్నారు. క్లిష్టతరమైన శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తూ ఎంతోమంది ప్రాణాలను కాపా డుతున్నారు. నిపుణులైన వైద్యులు,అత్యాధునిక వైద్య పరికరాలు, అంకిత భావంతో కూడిన పారామెడికల్ సిబ్బంది, ఆధునిక వసతులతో రోగి ఆరోగ్య సంరక్షనే ప్రధాన లక్ష్యంగా ఓమ్ని హాస్పిటల్స్ వైద్య సేవలందిస్తున్నాయి. ట్రాఫిక్ ఎవేర్ నెస్ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి ఉచితంగా అందించే హార్ట్ హెల్త్ చెకప్ కూపన్ లను వాహన చోదకులకు పంపిణీ చేశారు. ఈ కూపన్ ల ద్వారా ఉచితంగా కన్సల్టేషన్, గుండె ఆరోగ్య పరీక్షలు చేస్తారు. ట్రాఫిక్ అవేర్ నెస్ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. కార్యక్రమంలో ఓమ్ని ఆసుపత్రి ప్రతినిదులు, సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.








## ఆంధ్రుల ఆరాధ్యదైవం శ్రీ కనకమహాలక్ష్మీ

- మార్గశిర మాసోత్సవములకు శ్రీకారం
- శ్రీ అమ్మవారి పందిరిరాట మూహూర్తం

**విశాఖ దక్షణం, పెన్ పవర్, నవంబర్ 10** :ఉత్తరాంధ్ర జిల్లా భక్తుల ఇలవేల్పు, ఆంధ్రుల ఆరాధ్యదైవం మరియు భక్తులకు సౌభాగ్య ప్రదాయిని అయిన శ్రీ కనకమహాలక్ష్మీ అమ్మవా రి దేవస్థానంలో జరుగు మార్గశిరమా సోత్సవ ముల సందర్భముగా ప్రతి సంవత్సరము కార్తీక శుద్ధ ఏకాదశి రోజున పందిరిరాట వేసి మార్గశిర మాసోత్సవములకు శ్రీకారం చుట్టుట ఆనవా యితీగా వస్తున్నది. ఈ సాంప్రదాయం ప్రకారం తేది:12-11-2024న ఉదయం 9.40 ని..లకు నాదస్వర వాయిద్యాలు మరియు వేదమంత్రాల మధ్య ఈ సంవత్సరము తేది.02-12-2024 నుండి తేది. 30-12-2024 వరకు నిర్వహించ బోవు మార్గశిరమాసోత్సవముల సందర్భంగా పందిరి రాట ఉత్సవం శాస్త్రోక్తంగా నిర్వహిం చుటకు ఏర్పాట్లు చేయడ మైనది.



ఈ కార్యక్రమంనకు విశాఖపట్నం దక్షిణ నియోజవర్గ శాసన సభ్యులు సి.హెచ్. వంశీ కృష్ణ శ్రీనివాస్ ని దేవాలయ కార్యనిర్వహణా ధికారిణి కె. శోభారాణి వారు ఆహ్వానించుట జరిగినది.

## జోరుగా టి.డి.పి సభ్యత్వాల నమోదు.



- టి.డి.పి సభ్యత్వం కోసం యువత ఉత్సాహం చూపుతున్నారు.
- టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి
- మొల్లి లక్ష్మణరావు.

**భీమిలి, పెన్ పవర్,నవంబర్ 10.** :నాయకులు,కార్యకర్తలు టిడిపి సభ్యత్వాలను అధిక సంఖ్యలో నమోదు చేయించాలని, భీమి లి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు సూచన మేరకు మధురవాడ ప్రాంతంలో అత్యధిక సభ్య త్వాలు నమోదుకు కృషి చేస్తున్నామని టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణ రావు అన్నారు. ఆదివారం 5వ వార్డు పరిధి నగరంపాలెం, స్వతంత్రనగర్, రాజీవ్ గృహక ల్ప,శారదానగర్, స్వయంకృషినగర్ ప్రాంతాల లో సభ్యత నమోదు కార్యక్రమం నిర్వహించా రు. కార్యక్రమంలో టి.డి.పి పార్లమెంటరీ ఉపా ధ్యక్షులు వాంద్రారశి అప్పలరాజు,నియోజవర్గ బీసీ సెల్ అధ్యక్షులు నమ్మి శ్రీను,వార్డ్ అధ్యక్షు లు నాగోతి వెంకట సత్యనారాయణ,సీనియర్ నాయకులు ఈగల అప్పలనాయుడు,గండి రామనాయుడు,గంటరమేష్, మోహన్, రాంబా బు, కొత్తల శ్రీనివాసరావు,జోగేశ్వరపాత్రో,ఓలేటి శ్రావణ్, మోకార రవికుమార్,కంబపు కామరా జు,నల్లన ఆనందరావు,మహిళా నాయకురాలు నాగోతి అనిత, దుర్గ టి.డి.పి నాయకులు కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.



## తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్యక్రమానికి అనూహ్య స్పందన





**గాజువాక: పెన్ పవర్, నవంబర్ 10:** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ,గాజువాక నియోజకవర్గం శాసనసభ్యుడు పల్లా శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు గాజువాక తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ సూచనల మేరకు 73 వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ ప్రసాదుల విజయ సునీత ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సభ్యత నమోదు కార్యక్రమం వార్డు పరిధి సింహగిరి కాలనీ మరియు చిన్న నడుపూరు ప్రాంతాలలో చురుగ్గా చేపట్టారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి ఆసక్తి చెంది సభ్యత్వం తీసుకుంటున్నామని అన్నారు . ఈ కార్యక్రమంలో 73 వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గొలగాని రమణ వార్డు సీనియర్ నాయకులు నంబరు చిన్న దేముడు, నమ్మి సింహాద్రి ,దొడ్డి వెంకట అప్పారావు, వియ్యపు నరేష్ చిక్కాల రాజు, సిర్లం ప్రభాకర్ మొల్లి రాధా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# దుడ్డు లక్ష్మయ్య కుమారుడు సత్యనారాయణ కు ఢిల్లీలో డాక్టరేట్

**తన నిస్వార్థ సేవను గుర్తించిన ఢిల్లీ డెస్ప్రైన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ**






**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్,నవంబర్10:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో మన్యం గాయకునిగా పేరు తెచ్చుకున్న దుడ్డు సత్యనారాయణకు తన నిస్వార్థ సేవను గుర్తించి ఢిల్లీ డెస్ప్రైన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ వారు డాక్టరేట్ తో సత్కరించారు దుడ్డు సత్యనారాయణ తండ్రి పేరు దుడ్డు లక్ష్మయ్య. దుడ్డు సత్యనారాయణ పుట్టింది పాడేరు మండలం కాడేలి గ్రామం. ఆయన పెరిగింది మాత్రం పెదబయలు మండలం గంపరాయి గ్రామం. ఈయన మన్యం వాసులకు సుపరిచితులు. దుడ్డు సత్యనారాయణగా అందరికీ తెలిసిన వ్యక్తి. అనేక సేవ, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొంటూ మన్యం గాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుతం తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఒక రచయితగా మన్యం గాయకుడిగా అభిమానులను సంపాదించుకుంటున్నారు. దుడ్డు సత్యనారాయణ ఏ పార్టీకి చెందిన వ్యక్తి కాదు. అలాగని ఈ సంఘం కండువా కప్పుకోలేదు. కేవలం ఒక మన్యంబిడ్డగా తన మన్యానికి సేవలు అందించాలన్న సంకల్పంతో తన పాటల ప్రస్థానంతో గిరిజన ప్రజలను చైతన్య పరుస్తున్నారు. గతంలో ఆయన గిరి గ్రామాల చైతన్య పాదయాత్ర చేసి గిరిజన బిడ్డల యొక్క కష్టాలను పాటల రూపంలో ప్రస్తావించి గిరిజన ప్రాంత అభివృద్ధికి చైతన్యానికి కృషి చేశారు. ఉన్నత చదువులు చదివిన ఉద్యోగంలో ఉంటే ప్రజాసేవ చేయలేమని ఉద్యోగాన్ని మానుకొని ప్రజాసేవకే ఆయన అంకితం అయ్యారని పలువురు ఆయన శ్రేయోభిలాషులు చెబుతూ ఉంటారు. దుడ్డు సత్యనారాయణ తండ్రి చిన్న రిటైర్డ్ ఉద్యోగి, భార్య చంద్రకళ గవర్నమెంట్ ఉపాధ్యాయురాలు. తల్లి కిరాణా షాప్ నడుపుతుంది. తల్లిదండ్రులు భార్య సహకారంతోనే పాదయాత్ర సంకల్పకుడిగా, మన్యం గాయకుడిగా, మన్యం గేయ రచయితగా ఆయన గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన పాటల ప్రస్థానం చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించిన న్యూఢిల్లీలోని డెస్ప్రైన్ ఇంటర్ నేషనల్ యూనివర్సిటీ ఆయనకు డాక్టరేట్ ఇచ్చి సత్కరించింది. తనకు ఇచ్చిన డాక్టరేటును మన్యం ప్రజలకు, నా తల్లిదండ్రులకు అంకితం చేస్తున్నానని ఆయన మీడియాకు తెలిపారు. ఆయనతోపాటు మర్రి సత్తిబాబు, మర్రి సుబ్బారావు, మర్రి మల్లేశ్వరరావు, కిల్లో వెంకట్రావులు ఢిల్లీ వెళ్లి ఆయనకు డాక్టరేట్ ప్రధానం చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అల్లూరి జిల్లాలో సోలార్ కుంభకోణం నిజాలు నిగ్గు తేల్చండి!

- కోట్ల రూపాయల కుంభకోణం కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోండి!
- జిల్లా కలెక్టరుకు,ఎస్పీకి ఫిర్యాదు చేస్తాం!
- జనసేన పార్టీ అరకు పార్లమెంటు ఎగ్జిక్యూటివ్ మెంబెర్ గొర్లె వీర వెంకట్



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, నవంబర్ 10:**అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గూడెం కొత్తవీధి,కొయ్యూరు, చింతపల్లి మండలాలలో జరిగిన సోలార్ బ్యాటరీల కుంభకోణంపై నిజాలు నీగ్గు తేల్చాలని కారకులు ఎవరైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ అరుకు పార్లమెంటు ఎగ్జిక్యూటివ్ మెంబెర్ గొర్లె వీర వెంకట్ డిమాండ్ చేశారు.గత వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ సోలార్ కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు జరపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఇందులో కొందరు వైసిపి నాయకులు కీలక పాత్ర పోషించి సోలార్ కుంభకోణానికి పాల్పడ్డారని గూడెం కొత్తవీధి,చింతపల్లి మండలాలలో భారీ స్థాయిలో ఈ సోలార్ కుంభకోణం జరిగిందని దీనిపై పోలీస్ శాఖ సమగ్ర దర్యాప్తు జరిపి నిజా నిజాల నిగ్గు తేల్చి బయట పెట్టాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు.కోట్ల రూపాయల విలువ కలిగిన సోలార్ బ్యాటరీలను అమాయక ఆదివాసి గిరిజనులను మభ్యపెట్టి కొందరు సోలార్ బ్యాటరీ దొంగలు వాటిని మైదాన ప్రాంతాలకు తరలించి లక్షల రూపాయలకు విక్రయించుకున్నారని ఇందులో పాత్రలు పాత్ర దారులపై చర్యలు తీసుకొని వారి వద్ద నుండి తిరిగి రికవరీ చేయించాలని లేదా చట్ట ప్రకారం వారికి శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఆదివాసి ప్రాంతాలలోని మారుమూలకొండ ప్రాంతాలలో నివసించే గిరిజనులకు కరెంటు సదుపాయం కల్పించాలని లక్ష్యంతో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఈ సోలార్ బ్యాటరీల ద్వారా కరెంటు సౌకర్యాన్ని కల్పించిందని అయితే వాటి నిర్వహణ గత వైసిపి ప్రభుత్వ హయాంలో సక్రమంగా చేపట్టకపోవడం పలు గ్రామాలలో విద్యుత్తు సదుపాయం కలగడం వంటి కారణాల వలన కోట్ల రూపాయల విలువ కలిగిన సోలార్ పరికరాలు గ్రామాలలో నిరుపయోగంగా ఉండడాన్ని గుర్తించి వాటిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని లక్ష్యంతో కొంతమంది నాయకులు పథకం ప్రకారం ఈ సోలార్ పరికరాలను ఆదివాసి గిరిజనులను మభ్యపెట్టి మైదాన ప్రాంతాలకు తీసుకువెళ్లి భారీ ఎత్తున అమ్మకాలు జరిపారని, ఇందులో కీలకంగా పాత్ర వహించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఈ సోలార్ బ్యాటరీలు అన్ని మైదాన ప్రాంతానికి తరలిపోయాయని ఆయన అన్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఏ ఏ ప్రాంతాలలో సోలార్ పరికరాలు పోయాయో పోలీస్ శాఖకు ఫిర్యాదు చేయడం జరిగిందని అయితే దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. సోలార్ బ్యాటరీల కుంభకోణంపై పోలీసులు సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని నిజం నిగ్గు తేల్చాలని ఆయన కోరారు.

# ఉక్కు ప్రైవేటీకరణకై నినదించిన ఉత్తరాంధ్ర ప్రజానీకం



**గాజువాక: పెన్ పవర్, నవంబర్ 10:** టీ ఎన్ ఆర్ ఫంక్షన్ హాల్లో స్టీల్ వై ఎస్ ఆర్ టీ యూ సి ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కి వ్యతిరేకంగా ఉత్తరాంధ్రా ప్రజా సంస్థ నేత్రత్వంలో నేను సైతం 10 లక్షల పోస్ట్ కార్డ్స్ ఉద్యమంలో గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పోస్ట్ కార్డును ఆవిష్కరించారు.

అనంతరం నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పెద్ద మనస్సుతో అలోచించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే అతి పెద్ద ప్రభుత్వరంగ సంస్థ , 32 మంది ప్రాణ త్యాగాలతో సెంటు మెంటు కూడుకున్న ప్రత్యక్షంగా లక్ష కుటుంబాలు బ్రతుకుతున్న విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వెనక్కు తీసుకోవాలని,తక్షణమే కేంద్ర ప్రభుత్వం పది వేల కోట్లు రూపాయలు సహాయం అందివ్వాలని,సొంత గనులు కేటాయించాలని,భూములు ఇచ్చిన నిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని, ఉన్న ఉద్యోగులకు ప్రతీ నెల ఒకటో తేదిన జీతాలు ఇవ్వాలని అన్నారు

ఈ పోస్ట్ కార్డు ఉద్యమంలో ఉత్తరాంధ్రా ప్రజలు అందరు పాల్గొనాలని అన్నారు.

రాష్ట్రములో ఉన్న కూటమి ప్రభుత్వం పూర్తి భాద్యత తీసుకోని అఖిల పార్టీలను ఏర్పాటు చేసి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వద్దకు తీసుకోని వెళ్లాలని అన్నారు.

వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ తరుపున ఉత్తరాంధ్రా కో ఆర్డనేటర్ విజయ్ సాయి రెడ్డి ఆధ్వర్యంలో అమరణ నిరాహార దీక్ష చేస్తామని అన్నారు .

ఈ కార్యక్రమం లో మాజీ డి సి ఎం ఎస్ చైర్మన్ పల్లా చిన్నతల్లి,యూనియన్ నాయకుడు మార్డుపూడి పరదేశి,నక్క వెంకటరమణ,పిట్టా రెడ్డి,గోందేశీ అప్పలరెడ్డి,వాసా అప్పలరెడ్డి,ములకలపల్లి వెంకటేష్,పెద్దాడ కనకరాజు,టేకేటి వెంకటరమణ,పులి పెంటయ్య రెడ్డి,పల్లా పెంటరావు తదితరులు పాల్గొన్నారు.

# సివేరి, దొన్నుదొర ను స్వాగతం పలికిన నాయకులు,కార్యకర్తలు.



**హారతులతో స్వాగతం పలికిన మహిళ కార్యకర్తలు..**

**అనంతగిరి పెన్ పవర్ నవంబర్ 10 :** మండలంలోని ముఖద్వారమైన చిలకలగెడ్డ పంచాయతీలో అరకు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి సీవేరి ,దొన్ను దొర ను ఏపీ. ఎస్.ఆర్.టి.సి రీజనల్ చైర్మన్ గా నియమతులైన సందర్భంగ దొన్ను దొరను భీంపోలు, ఎన్.ఆర్.పురం, గరుగుబిల్లి,గుమ్మకోట, చిలకలగెడ్డ,పంచాయతీకి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు,నాయకులు అభిమానులు, భారీ ఎత్తున చిలకలగెడ్డ పంచాయతీ వద్ద చేరుకునీ ముందుగా హారతి ఇచ్చి పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. దొన్నుదొర పై నమ్మకంతో ఏపీ.ఎస్.ఆర్టీసీ. రీజినల్ చైర్మన్ గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రివర్యులు నారా లోకేష్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

చిలకలగెడ్డ గ్రామానికి చెందిన నెలివాడ,శంకర్రావు అనే యువకుడు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మరణించిన కుటుంబానికి దొన్ను దొర పరామర్శించారు. మీ కుటుంబానికి కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ధైర్యం ఇచ్చారు ఈ కార్యక్రమంలో భీంపోలు కమిటీ అధ్యక్షులు పల్లి, సింహాచలం, బూత్ ఇన్చార్జి జన్ని, సింహాద్రి దొర. 8వ వార్డు మెంబర్ జన్ని, శ్రీనివాసరావు గుమ్మకోట, బూత్ ఇన్చార్జి సుర్ర,వెంకటేశ్, స్వామి, బంటు చిన్నారావు,సుకూరు, మహేష్, బిడ్డ మహేష్ ఎన్.ఆర్.పురం సర్పంచ్ రామయ్య, సన్యాసిరావు చిలకళగెడ్డ మాజి ఉప సర్పంచ్ బురగబోయిన, చంటి,బూరగబోయిన,సురేష్ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





# చింతపల్లిలో అటవీ సంస్మరణ దినోత్సవం








**చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 10:-** చింతపల్లి అటవీ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర అటవీ సంస్మరణ దినోత్సవం చింతపల్లి డివిజనల్ అటవీ అధికారి వై వి నరసింహారావు ఆధ్వర్యంలో జరిగింది, విధి నిర్వాహణలో అమరులైన అటవీ ఉద్యోగులకు ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరుల త్యాగాలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అటవీ రేంజర్ లు అప్పారావు, పాత్రుడు,వర్మ,చింతపల్లి, సీలేరు, పెదవలస, ఆర్ వి నగర్, లోతు గడ్డ రేంజ్ నుండి 70 మంది పైగా అటవీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు

# గాండ్ల తెలికుల ఉద్యోగ పెన్షనర్ల సంఘం సమావేశం.

- ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ
- ఆత్మీయ అతిథిగా డాక్టర్ పెబ్బిలి రవికుమార్



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం నవంబ ర్. 10 :** రాష్ట్రంలో మెరుగైన వసతులను, అవకాశాలను పొందడమే లక్ష్యంగా ఏజిటియుపిఎస్ఎస్ పనిచేస్తుంది అని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాకాటి హరికృష్ణ అన్నారు,అఖిల గాండ్ల తెలికుల ఉద్యోగుల ఉపాధ్యాయుల పెన్షనర్ల సంక్షేమ సంఘమైన ఏ జి టి యు పి ఎస్ ఎస్ యొక్క ఉత్తరాంధ్ర జిల్లాలకి సంబంధించిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు కలిసి ఆత్మీయ సమావేశంని విశాఖపట్నంలోని ఎన్జీవో హోం నందు ఘనంగా జరిగింది,ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘం యొక్క అధ్యక్షుడైన వాకాటి హరికృష్ణ ,రాష్ట్ర నాయకులు గిరిశ్రీనివాస్, మరియు శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, విశాఖపట్నం తదితర జిల్లాల నుంచి సభ్యులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర గాండ్ల తెలికుల కుల చరిత్రలో కని విని ఎరుగని రీతిలో ఒక నూతన అధ్యాయంగా విశాఖపట్నం జిల్లాకు చెందిన ఒక మహిళ ఉద్యోగిని, ఉపా ధ్యాయురాలు అయిన శ జామి పద్మావతి గని సంఘానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగింది. ఇది గతంలో ఎప్పుడు జరగని ఒక నూతన ఒరవడికి శ్రీకారం చుట్టినట్టు అద్భు తమైన ఘటన నేడు విశాఖపట్నంలో జరిగింది. మహిళలకి ,మహిళా ఉద్యోగినులకు అన్నింటా అవకాశాలు అందివ్వాలని, అన్నిరంగాలలో మహిళలకు ప్రాధాన్యతను పెంచాలని ఎ.జి.టి. యు.పి.ఎస్.ఎస్ తీసుకున్న నిర్ణయానికి ఈ కార్యక్రమం వేదికగా అయినది. గాండ్ల తెలికుల ప్రజలకు మెరుగైన వసతులు అవకాశాలను కల్పించడానికి ఉద్యోగులు ఉపాధ్యాయులు మేధావులు అందరూ కలిసికట్టుగా రావాలని ఉత్తరాంధ్ర జిల్లా ఉద్యమాల గడ్డగా పేరుంది అని గాండ్ల తెలికుల సమాజానికి సంఘం పెద్ద ఎత్తున బాధ్యతలు తీసుకొని తిరుపతిలో నూ,విశాఖపట్నంలోనూ, శ్రీశైలం వంటి రకర కాల పట్టణాలలో విశిష్ట సేవ చేయడానికి సం ఘం ముందువరుసలో ఉంటుందని ఏ.జీ.టీ యూపిఎస్ఎస్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వాకా టి హరికృష్ణ గల్ అన్నారు. కులమన్న తర్వాత అందరూ ఒకటేనని అందరూ కలిసికట్టుగా పని చేసి సమాజంలో అన్ని కులాల కన్నా మెరుగైన కులం గా ఉత్తమ లక్షణాలు కలిగి ఉన్నత స్థితి లోకి తీసుకురావడానికి ప్రజలందరూ కలిసి రావాలని ఈ సందర్భంగా ఈ యొక్క సమావే శానికి ఆత్మీయ అతిథిగా విచ్చేసిన పెబ్బిలి రవికుమార్ అన్నారు, సంఘం యొక్క బలోపే తానికి, కులానికి నిరంతరం సేవ చేయడానికి తాను ఎప్పుడూ ముందు వరసలో ఉంటానని ఈ సందర్భంగా తెలిపారు.

# పాము కాటుకు గురైనా బాలిక - తప్పిన పెను ప్రమాదం

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, నవంబర్ 10.**అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండలంలోని ఏనుగురాయి పంచాయితీ గిద్దులపుట్టు గ్రామానికి చెందిన తమర్బ ధనలక్ష్మి (14) అను బాలిక పాముకాటుకు గురై తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం గ్రామ సమీపంలో వ్యవసాయ పనుల్లో భాగంగా కుటుంబ సభ్యులతో కలిసి సమీప పొదల్లో 3 గంటలకు వెళ్లి సాముల కోత కొస్తున్న సమయంలో బాలికను ఆకస్మికంగా పాము కాటేసిందని, దీంతో ఒక్కసారిగా ధనలక్ష్మి సొమ్మసిల్లి కిందకు పడిపోయి తీవ్ర అస్వస్థతకు గురైందన్నారు. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన ముంచింగిపుట్టు సామజిక ఆరోగ్య కేంద్రంలో తరలించామని, వైద్యసిబ్బంది ధనలక్ష్మి కు వైద్యసేవలు అందించడంతో ప్రాణాపాయం తప్పిందన్నారు. ప్రస్తుతం ధనలక్ష్మి పరిస్థితి మెరుగ్గా ఉందని, ఎటువంటి ఇబ్బంది లేదని వైద్యసిబ్బంది తెలుపరన్నారు.



# అంతర్జాతీయ - సెక్స్ - రాజకీయం.. ఈ విషయాలు తెలుసా?

హైదరాబాద్ పెన్ పవర్: సెక్స్.. వ్యక్తుల కుటుంబ జీవనంలో కీలక పాత్ర పోషించే ప్రధాన అంశం. ఓ వయసు వచ్చిన తర్వాత.. వివాహ బంధంతో ఒక్కటయ్యే జంట.. కుటుంబ జీవనంలోకి అడుగులు వేస్తారు. తద్వారా.. సెక్స్ ను అధికారికంగా తమ జీవితంలో భాగం చేసుకుంటారు. అయితే.. ఇది ఎప్పుడూ గోప్యంగా ఉండే అంశమే. భారత్ వంటి సంప్రదాయాలకు పెద్ద పీట వేసే దేశాల్లో అయితే.. మరింత గోప్యం. కానీ, ఇప్పుడు ఈ సెక్స్ అంశం.. అంతర్జాతీయ వేదికలపై చర్చనీయాంశం అయింది. ప్రధానంగా గత రెండు రోజుల నుంచి కూడా.. కీలకమైన రెండు దేశాల్లో - సెక్స్ - వ్యవహారం చర్చగా మారి.. అంతర్జాతీయ మీడియాను కుదిపేస్తోంది. అటు రష్యా, ఇటు అమెరికా.. రెండూ కూడా అగ్రరాజ్యాలే. అయితే.. ఈ రెండుదేశాల్లోనూ గత రెండుమూడు రోజులుగా సెక్స్‌పై అనేక వార్తలు, ఉద్యమాలు.. కూడా తెరమీదికి వచ్చాయి. దీంతో అసలు ఆయా దేశాల్లో సెక్స్ చుట్టూ తిరుగుతున్న రాజకీయం ఏంటి? అసలు ఎందుకు ఇలా జరిగింది? అనేది ఆసక్తిగా మారింది.



**రష్యాలో..**

రష్యాలో దంపతుల మధ్య సెక్స్‌ను ఖచ్చితత్వం చేస్తూ.. అక్కడి పుతిన్ ప్రభుత్వం తీర్మానం చేసింది. అంతేకాదు.. సెక్స్ కోసం దంపతులు నిర్బంధ సమయం కేటాయించాలని కూడా ఉత్తర్వులు జారీ చేయడం సంచలనంగా మారింది. ఇక, దంపతుల మధ్య శృంగారాన్ని పెంపొందించేందుకు, పిల్లలను కనేందుకు కూడా.. ఒక పర్యవేక్ష విభాగాన్ని ప్రత్యేక మంత్రిత్వ శాఖను కూడా ఏర్పాటు చేశారు. అక్కడితో కూడా ఆగకుండా.. ప్రధాన నగరాల్లో.. సెక్స్‌ను ప్రోత్సహించేందుకురాత్రి పది గంటల నుంచి తెల్లవారు జాము 4 వరకు గృహ విద్యుత్ సరఫరాను ఈ నెల 11వ తేదీ నుంచి అమలు చేస్తున్నారు. దీనికి కారణం.. ఉక్రెయిన్‌తో ఎడతెరిపి లేకుండా రష్యా యుద్ధం చేస్తున్న విషయం తెలిసిందే. తద్వారా.. దేశవ్యాప్తంగా మరణాలు పెరిగిపోయి.. జనభా సంఖ్య తగ్గిపోతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేప థ్యంలోనే నిర్బంధ జననాలకు పుతిన్ సర్కారు పచ్చ జెండా ఊపింది. అందుకే.. శృంగారాన్ని ప్రోత్స హించే శాఖను, పర్యవేక్షించే విభాగాన్ని ఏర్పాటు చేయడం గమనార్హం. అయితే.. ఈ నిర్ణయంపై రష్యాలో ఉద్యమాలు ప్రారంభమవుతున్నాయి. సెక్స్ అనేది.. మానసికంగా జరిగే ప్రవర్తనను బట్టి.. ఉత్తేజమవు తుందని.. నిర్బంధాలతో కాదన్నది ప్రజాస్వామ్య వాదులు చెబుతున్న మాట.

**అమెరికాలో..**

అమెరికాలో మరో చిత్రమైన వ్యవహారం తెరమీదికి వచ్చింది. ఇక్కడ కుటుంబాల్లో సెక్స్ కు లోటు లేదు. కానీ, దీని వల్ల గర్భందాల్చే మహిళలు.. సంతానం పెరిగిపోతుందన్న ఆవేదనతో అబార్షన్ హక్కుల కోసం కొన్ని దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నారు. ఈ హక్కుకు బైడెన్ సర్కారు పచ్చ ఊపింది. కానీ, ఎన్నికల సమయంలో ట్రంప్..

ఈ హక్కును తాము తీసేస్తామన్నారు. ఇప్పుడు ఆయనే అధికారంలోకి వచ్చారు. జనవరి 20న పగ్గాలు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో అబార్షన్ హక్కును కొనసాగిస్తామని ట్రంప్ హామీ ఇవ్వాలని మహిళలు పట్టుబడుతున్నారు. ఈ క్రమంలో ఆ హక్కును సాధించుకునే వరకు.. నో సెక్స్-నో మ్యారేజ్ నినాదంతో ఉద్యమాలు చేయాలని నిర్ణయించారు. సో.. ఇలా అంతర్జాతీయంగా ఈ రెండు దేశాలు సెక్స్ విషయంలో రాజకీయంగా చర్చనీయాంశం కావడం గమనార్హం.

# 'బెదిరిస్తే ఎవరూ బెదిరిపోరు'... జగన్ కి పవన్ స్ట్రాంగ్ వార్నింగ్!

హైదరాబాద్ పెన్ పవర్: ప్రస్తుతం ఏపీ రాజకీయాల్లో మూడు ఆరోపణలు, ఆరు కేసులు, తొమ్మిది అరెస్టులు అనే సందడి నెలకొందనే కామెంట్లు వినిపిస్తున్నాయి. మొన్నటి వరకూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై చర్చలు జరగ్గా.. తర్వాత మహిళలపై జరిగిన హత్యాచారాలపై చర్చలు జరిగాయి.. ఇప్పుడు సోషల్ మీడియాలో పోస్టింగులు చేసిన వారి అరెస్టుల గురించిన చర్చ జరుగుతుంది.అవును... హోంమంత్రే కాకుండా.. ముఖ్యమంత్రి దగ్గర నుంచి, మిగిలిన శాఖ మంత్రులతో పాటు చిన్నా చితకా నేతలు కూడా ఇప్పుడు కేసులు, అరెస్టుల గురించి వ్యాఖ్యానిస్తున్నారు! ఈ నేపథ్యంలో సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టులపై స్పందించిన జగన్... ప్రతీ ఏపీ పోలీస్ అధికారికి చెబుతున్నా.. న్యాయాన్ని గౌరవించండి అని సూచించారు.అనంతరం... న్యాయాన్ని గౌరవించండి.. ధర్మాన్ని కాపాడండి.. మీరు చేసిన ఇల్లీగల్ యాక్టివిటీస్ ని దగ్గరుండి బయటకు తీస్తాం.. డిప్యూటేషన్ పై పక్క రాష్ట్రాలకు వెళ్లిపోయినా.. సప్తసముద్రాల అవతల ఉన్నా పిలిపిస్తాం.. అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర సంచలనంగా మారాయి.



ఈ క్రమంలో... తమది మంచి ప్రభుత్వమే కానీ, మెతక ప్రభుత్వం కాదని చెబుతూ డిప్యూటీ సీఎం సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా.. ఐఏఎస్, ఐపీఎస్ లతో పాటు అధికారులకు వార్నింగ్ ఇస్తే సుమోటోగా కేసులు పెడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జగన్, వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.


గుంటూరులో జరిగిన అటవీశాఖ అమరవీరుల సంస్కరణ కార్యక్రమంలో పాల్గొన్న పవన్... మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరవై ఏళ్లు అధికారంలో ఉంటామంటూ అధికారులను ఇష్టం వచ్చినట్లు ఉపయోగించుకున్నారని.. ఘోరమైన తప్పిదాలు చేయించారని పవన్ విమర్శించారు.

అనంతరం... మాజీ సీఎం అయినా, ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నారు.. మీకు బాధ్యత ఉండాలి.. సప్త సముద్రాలు అవతల ఉన్నా పట్టుకొస్తామని తిరుపతి ఎస్పీ సుబ్బారయుడిని, రిటైర్ అయినా వదలబోమని డీజీపీని ఉద్దేశించి అన్నారు.. వారిపై చిన్న ఈగ వాలినా మీరే బాధ్యత వహించాలి అని పవన్ అన్నారు.

దీంతో... తప్పుడు కేసులు పెట్టే పోలీసు అధికారులను వదిలిపెట్టమంటూ జగన్ ఇచ్చిన వార్నింగ్ కి పవన్ స్ట్రాంగ్ గానే రియాక్ట్ అయ్యారనే చర్చ మొదలైంది. ఈ సందర్భంగా పోలీసు అధికారులపై గతంలో పలువురు నేతలు చేసిన వ్యాఖ్యలు, హడావిడిలు తెరపైకి వస్తున్నాయి.

ఏది ఏమైనా... జగన్ వ్యాఖ్యలకు పవన్ మాత్రం తగ్గేదే లే అంటూ విరుచుకుపడుతున్నారు. ఇందులో భాగంగానే "మీరు బెదిరిస్తే ఎవరూ బెదిరిపోరు" అంటూ జగన్ ని ఉద్దేశించి స్ట్రాంగ్ గా రియాక్ట్ అయ్యారు! ఇదే సమయంలో... షర్మిల అడిగితే భద్రత కల్పిస్తామని ఏపీ డిప్యూటీ సీఎం చెప్పారు.

# చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి... తగ్గేదేలే!




హైదరాబాద్ పెన్ పవర్: సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం.. పలువురు కీలక నేతలు పార్టీని వీడటం.. మరికొంతమంది మౌనంగా ఉండటం.. ఇంకొంతమంది త్వరలో ఫ్యాన్ కింద నుంచి లేచి వెళ్లిపోతారనే కథనాలు వస్తుండటం.. మరోపక్క పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు, అరెస్టులు.. ఇంకోపక్క ఇప్పటికే రిమాండుల్లో పలువూరు నేతలు... వెరసి వైసీపీ తీవ్ర కష్టాల్లో ఉందని అంటున్నారు.ఈ సమయంలో గతంలో ప్రభుత్వంలో ఉండగా సందడి చేసి, చక్రాలు గిర్రా తిప్పుతూ హల్ చల్ చేసిన నేతలు సైలెంట్ అయిపోయిన పరిస్థితి! దీంతో... నియోజకవర్గాల్లోని కార్యకర్తలు, నాయకులు సైలెంట్ అయిపోయారని.. ఎవరి పని వాళ్లు చూసుకుంటూ రాజకీయాలకు కాస్త ఎడంగా ఉంటున్నారనే కామెంట్లు వినిపిస్తున్నాయి.ఇక నాయకుల బర్త్ డే సెలబ్రేషన్స్, కార్యకర్తలు ఏర్పాటు చేసే కార్యక్రమాలు వంటి సందడులు కూడా కనిపించడం లేదని అంటున్నారు. ఇలా వైసీపీ నేతల్లోనూ, కార్యకర్తల్లోనూ మౌనం ఆవహించిందని.. సైలెంట్ అయిపోయారని అంటున్న సమయంలో... "తగ్గేదే లే" అంటూ సందడి చేస్తున్నారు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి. చంద్రగిరి నియోజకవర్గాన్ని తన అడ్డా చేసుకుని రాజకీయాలు చేసిన చెవిరెడ్డి.. ఇటీవల ఎన్నికల్లో ఒంగోలుకు షిఫ్ట్ అయిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... ఇటీవల జరిగిన ఎన్నికల్లో తన కుమారుడు చంద్రగిరి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయగా.. చెవిరెడ్డి ఒంగోలు ఎంపీగా పోటీ చేశారు. అయితే రెండు చోట్లా ఇద్దరూ ఓటమి పాలయ్యారు.

ఈ నేపథ్యంలో తాజాగా చెవిరెడ్డి బర్త్ డే సెలబ్రేషన్స్ ని ప్లాన్ చేశారు. దీంతో.. రాష్ట్రంలో పార్టీ అధికారంలో లేదు, నమ్ముకున్న నాయకుడు సీఎం హోదాలో లేరు, ఎమ్మెల్యే పదవీ లేదు, ఎంపీ సీటులో గెలుపూ లేదు.. అందువల్ల ఉన్నంతలో సైలెంట్ గానే బర్త్ డే సెలబ్రేషన్స్ జరుగుతాయని చాలా మంది భావించారంట. కానీ.. చెవిరెడ్డి తగ్గలేదని అంటున్నారు.అవును... శనివారం తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామంలో చెవిరెడ్డి బర్త్ డే వేడుకలు ఏర్పాటు చేశారు. అది కూడా ఊహించనంత పెద్ద ఎత్తున అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాతిక నుంచి 30 వేల మంది నాయకులు, లక్షల మంది కార్యకర్తలతో విందు వినోదాలతో, బాణసంచా శబ్ధాలతో బర్త్ డే సెలబ్రేషన్స్ వేరే లెవెల్ లో జరిగాయి! ఈ వేడుకల్లో పాల్గొనడానికి చంద్రగిరి నియోజకవర్గంతో పాటు చిత్తురు, తిరుపతి జిల్లాల నుంచి పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ వేడుకలకు హాజరయ్యారు. పైగా ప్రస్తుత రాజకీయాల్లో అధికారంలో ఏ పార్టీ ఉంటే మెజారిటీ స్థానిక సంస్థల ప్రతినిధులు ఆ పార్టీలో ఉంటున్నారని.. పక్క పార్టీల నేతలతో కనీసం మాట్లాడటంలేదనే చర్చలు జరుగుతున్నాయి!అయితే... చెవిరెడ్డి విషయంలో మాత్రం అలా జరగలేదని తెలుస్తోంది. ఆయన బర్త్ డే కార్యక్రమానికి పార్టీలకు, ప్రాంతాలకు అతీతంగా హాజరయ్యారని తెలుస్తోంది. పక్క పార్టీలకు చెందిన నేతలు కూడా క్యూ కట్టారని అంటున్నారు. ఇందులో భాగంగా... సర్పంచ్ లు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచ్ లు పార్టీలకు అతీతంగా చెవిరెడ్డికి శుభాకాక్షలు చెప్పారని చెబుతున్నారు.ఇక లాస్ట్ బట్ నాట్ లీస్ట్ అయిన కీలక పాయింట్ ఏమిటంటే... టీడీపీ ప్రస్తుత ఎమ్మెల్యే పులపర్తి నాని సతీమణి కూడా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి శుభాకాంక్షలు చెప్పారని అంటున్నారు. దీంతో.. చెవిరెడ్డా మజా అంటూ కామెంట్లు పెడుతున్నారు వైసీపీ జనాలు!

# మహా- ఎన్నికల్లో కేసీఆర్ ఉనికి.. ప్రశ్నార్థకం!



హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణకు పొరుగున ఉన్న మహారాష్ట్రలో కీలకమైన అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ నెల 20న అక్కడ పోలింగ్ జరగనుంది. అంటే.. మరో పది రోజుల్లోనే ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టం పూర్తి కానుంది. ఇలాంటి సమయంలో తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ ప్రస్తావన కానీ, ఆయన పేరు కానీ.. ఎక్కడా వినిపించకపోవడం.. ఆయన తాలుకు ఫొటోలు కూడా కనిపించకపోవడం గమనార్హం. నిజానికి తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్రసమితిగా మార్చింది.. జాతీయస్థాయిలో పుంజుకునేందుకే.ఈ విషయాన్ని అప్పట్లో కేసీఆర్ కూడా పదే పదే చెప్పారు. అంతేకాదు.. మహారాష్ట్రలోని తెలంగాణ సరిహద్దు జిల్లాలైన నాందేడ్, గడ్చిరోలి, చంద్రపూర్, యవత్మాల్ లలో బీఆర్ ఎస్ జెండాను కూడా ఎగుర వేశారు. అక్కడి చోటా నాయకులను కూడా పార్టీలోకి తీసుకున్నారు. చిన్న చితక పార్టీలకు మద్దతు కూడా ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తాము ఇక్కడ పోటీ చేస్తామని కూడా చెప్పారు. దాదాపు 56 అసెంబ్లీ నియోజకవర్గాలకు పైగా ఇక్కడ ఉన్నాయి. అయితే.. ఇదంతా గతం.ప్రస్తుత పరిస్థితిని చూస్తే.. కేసీఆర్ ఎక్కడా కూడా మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి పెట్టలేదు. మొత్తం 288 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్న మహారాష్ట్రలో ఒక్కటంటే ఒక్కస్థానంలోనూ కేసీఆర్ పార్టీ కానీ, ఆయన మద్దతిచ్చే నాయకులు కానీ కనిపించడం లేదు. అంటే.. మహా ఎన్నికల్లో పోటీ చేస్తామని.. ఇక్కడ బీజేపీని, కాంగ్రెస్‌ను బలంగా ఎదిరించి తాము ప్రత్యామ్నాయంగా ఎదుగుతామని చెప్పిన అన్ని మాటలు వృథా అయ్యాయి. పోనీ.. కేసీఆర్ కోసం వేచి చూసిన పార్టీలకు కూడా ఆయన ఎలాంటి మద్దతు ప్రకటించకపోవడం గమనార్హం. మొత్తానికి బీఆర్ ఎస్ తెలంగాణకే పరిమితం అవుతుందనే సంకేతాలు వస్తున్నాయి.

# మాటకందని విషాదం.. రైల్వే స్టేషన్‌లో ఘోరం



హైదరాబాద్ పెన్ పవర్: ఊహకు అందని విషాదం.. మాటల్లో చెప్పలేని ఘోరం.. లోకో పైలట్ నిర్లక్ష్యం వల్ల ఓ ఉద్యోగి ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. రైలు ఇంజిన్, కోచ్ మధ్యలో నలిగిపోవాల్సి వచ్చింది. ఘటనను చూస్తేనే కన్నీళ్లు పుట్టుకొస్తున్న ఈ హృదయవిదారక ఘటన బిహార్‌లోని సమస్తిపూర్ జిల్లా బరౌనీ రైల్వే జంక్షన్‌లో జరిగింది.దేశంలో అతిపెద్ద రవాణా సంస్థ రైల్వే. అంత పెద్ద సంస్థలో సేఫ్టీ కరువైందని మరోసారి ఈ ఘటన రుజువు చేసింది. అంతేకాదు.. ఈ మధ్య ఎక్కడో ఒకచోట రైల్వే ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. పదుల సంఖ్యలో ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు. వందల సంఖ్యలో గాయపడుతున్నారు. అయితే.. రోజురోజుకూ పుట్టుకొస్తున్న టెక్నాలజీని వినియోగించడంలో రైల్వే శాఖ విఫలం అవుతున్నట్లుగా విమర్శలు వినిపిస్తున్నాయి.తాజాగా.. బరౌనీ రైల్వే జంక్షన్‌లో జరిగిన ఈ ఘోరం మరోసారి నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతోంది. అరుణ్ కుమార్ రౌత్ అనే వ్యక్తి ఈ జంక్షన్‌లో షంట్ మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. రైలు ఇంజిన్, పార్సెల్ వ్యాన్ బోగీ మధ్య కప్లింగ్‌ను జత చేస్తుండగా.. లోకో పైలట్ ఒక్కసారిగా రైలు ఇంజిన్‌ను వెనక్కి తీసుకొచ్చారు. దీంతో అరుణ్ ఇంజిన్, బోగీ మధ్య చిక్కుకుపోయాడు. అప్పటికే అక్కడి ప్రయాణికులు పెద్ద ఎత్తున కేకలు వేశారు. కానీ.. లోకో పైలట్ కనీసం ఇంజిన్‌ను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం కూడా చేయకుండా దిగి పారిపోయాడు. దీంతో విలవిల్లాడుతూ అందరి ముందే అరుణ్ ప్రాణాలు కోల్పోయారు. లక్నో-బరౌనీ ఎక్స్‌ప్రెస్ రైలు బరౌనీ స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్ నంబర్ 5కు చేరుకున్న సమయంలోనే ఈ విషాదం చోటుచేసుకుంది.

ఈ దుర్ఘటనను ప్రయాణికులు తమ సెల్‌ఫోన్లలో బంధించారు. దీంతో ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దానిని చూసిన వారంతా అయ్యో.. పాపం అంటూ కన్నీళ్లు కారుస్తున్నారు. మరోవైపు.. లోకో పైలట్ నిర్లక్ష్యం వల్లే అరుణ్ చనిపోవాల్సి వచ్చిందని ప్రయాణికులు అంటున్నారు. కాగా.. ఈ ఘటనపై రైల్వే శాఖ అధికారులు విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. ఆ తదుపరి ఇంజిన్‌ను ముందుకు తీసి మృతదేహాన్ని బయటకు తీశారు. మరోవైపు.. రైల్వే శాఖ నిర్లక్ష్యంపై నెటిజన్లు సైతం ఫైర్ అవుతున్నారు.

# పరారీలో వైఎస్ అవినాష్ రెడ్డి పీఏ... అంచనాలివే!



హైదరాబాద్ పెన్ పవర్: సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసినవారిపై ఏపీ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. దీంతో సాధారణ కార్యకర్తలు దొరికిపోతుంటే.. నేతలు మాత్రం మిస్సైపోతున్నారనే చర్చ నడుస్తుంది. ఈ నేపథ్యంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పీఏ రాఘవరెడ్డి పరారీలో ఉన్నారని తెలుస్తోంది.

అవును... కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పీఏ రాఘవరెడ్డిని అదుపులోకి తీసుకునేందుకు పులివెందుల పోలీసులు ఆయన ఇంటికి వెళ్లారు. ఇందులో భాగంగా.. పులివెందుల అర్బన్ ఎస్.ఐ. జీవన రంగనాథ్ ఆధవర్యంలో పోలీసు బృంధాలు ఆయన ఇంటికి వెళ్లాయి. అయితే.. రాఘవరెడ్డికి ముందే సమాచారం అందిందో ఏమో కానీ.. ఆయన ఇంటివద్ద లేడని అంటున్నారు.వాస్తవానికి వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీందర్ రెడ్డి తప్పించుకున్న సమయంలో అతనితో రాఘవరెడ్డి ఛాటింగ్ చేసినట్లు పోలీసులు గుర్తించారని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే రాఘవరెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించాలని పోలీసులు ఆయన ఇంటికి వెళ్లారు. అయితే విషయం తెలుసుకున్న రాఘవరెడ్డి.. అజ్ఞాతంలోకి వెళ్లినట్లు అంచనా వేస్తున్నారు!

దీంతో.. ఆయన ఇంటి లోపల సోదాలు చేసి, కుటుంబ సభ్యులతో మాట్లాడిన పోలీసులు.. రాఘవరెడ్డి ఇంటికి వచ్చిన వెంటనే తమకు సమాచారం అందించాలని పోలీసులను ఆదేశించారు. ఈ సమయంలో రాఘవరెడ్డి కుటుంబ సభ్యులతో పాటు లాయర్ ఓబుల రెడ్డి అక్కడకు చేరుకున్నారు.మరోపక్క పరారైన రవీందర్ రెడ్డిని పట్టుకోవాలని పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరరం చేశారని అంటున్నారు. అయితే.. రవీందర్ రెడ్డి తప్పించుకున్న విషయంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, సీఐ తేజ మూర్తిపై ఇప్పటికే వేటు పడింది. ఆ స్థానంలోకి వచ్చిన ఎస్పీ విద్యాసాగర్... నాలుగు స్పెషల్ టీమ్స్ ని ఏర్పాటు చేసి రవీందర్ రెడ్డి కోసం గాలిస్తున్నారని సమాచారం!

# టీ20 క్రికెట్‌లో ఎవరూ సాధించని రికార్డు నెలకొల్పిన ఫిల్ సాల్ట్

## ఒకే జట్టుపై మూడు సెంచరీలు సాధించిన ఏకైక క్రికెటర్‌గా ఇంగ్లండ్ ఓపెనర్

## వెస్టిండీస్‌పై గతేడాది 2, తాజాగా మరో సెంచరీ నమోదు చేసిన సాల్ట్

## ఇంగ్లండ్ వర్సెస్ విండీస్ తొలి టీ20లో శతకంతో విధ్వంసం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లండ్ విధ్వంసకర బ్యాట్స్‌మన్ ఫిల్ సాల్ట్ మరోసారి చెలరేగాడు. కెన్సింగ్టన్ ఓవల్ వేదికగా వెస్టిండీస్- ఇంగ్లండ్ మధ్య శనివారం జరిగిన మ్యాచ్‌లో సెంచరీ బాదాడు. 183 పరుగుల లక్ష్య ఛేదనలో 54 బంతులు ఎదుర్కొని 103 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచాడు. 9 ఫోర్లు, 6 సిక్సర్లతో వెస్టిండీస్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఫిల్ సాల్ట్ సంచలన ఇన్నింగ్స్‌తో 183 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 16.5 ఓవర్లలో ఛేదించింది. ఇంగ్లండ్ గెలుపులో కీలక పాత్ర పోషించి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్న ఫిల్ సాల్ట్... టీ20 ఫార్మాట్ క్రికెట్‌లో ఇప్పటివరకు ఎవరూ అందుకోని రికార్డును నెలకొల్పాడు. టీ20ల్లో ఒకే జట్టుపై మూడు శతకాలు సాధించిన ఏకైక ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. గతేడాది ఇంగ్లండ్, వెస్టిండీస్ మధ్య జరిగిన టీ20 సిరీస్‌లో ఫిల్ సాల్ట్ వరుసగా రెండు శతకాలు బాదాడు. నిన్న (శనివారం) మరో సెంచరీ నమోదు చేయడంతో వెస్టిండీస్‌పై మూడు సెంచరీలు సాధించిన బ్యాటర్‌గా నిలిచాడు

కాగా కెన్సింగ్టన్ ఓవల్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై ఇంగ్లండ్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 182 స్కోర్ చేసింది. ఓపెనర్‌గా వచ్చిన ఫిల్ సాల్ట్ సెంచరీతో చెలరేగడంతో ఇంగ్లండ్ సునాయసంగా విజయాన్ని సాధించింది.

# ఒక ప్లేయర్‌కు ఇన్ని అవకాశాలా.. టీమిండియా ఓపెనర్‌కు లాస్ట్ ఛాన్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియాలో ఛాన్స్ రావాలంటే ఎంత కష్టమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వచ్చిన అవకాశాలు ఉపయోగించుకోకపోతే జట్టులో వేగంగా ఛాన్స్ కోల్పోతారు. అయితే పంజాబ్ ప్లేయర్ అభిషేక్ శర్మ మాత్రం ఇందుకు మినహాయింపు. అతను వరుసగా విఫలమవుతున్నా తుది జట్టులో చోటు కల్పిస్తున్నారు. అతడి మీద నమ్మకంతో ప్రతి మ్యాచ్ లో అవకాశం ఇస్తున్నారు. ఐపీఎల్ లో పవర్ హిట్టింగ్ తో భారత జట్టులో స్థానం దక్కించుకున్న ఈ యువ ప్లేయర్.. భారత తరపున ఘోరంగా విఫలమవుతున్నాడు. జింబాబ్వేపై మెరుపు సెంచరీ చేసి ఒక్కసారిగా ఓ వెలుగు వెలిగాడు. ఆ తర్వాత ఒక్క మ్యాచ్ లోనూ కనీసం 20 పరుగులు చేయలేకపోయాడు. అతని చివరి 7 ఇన్నింగ్స్ లు చూసుకుంటే కనీసం 10 బంతులు కూడా ఆడలేకపోయాడు. జింబాబ్వేపై హాఫ్ సెంచరీ తర్వాత అభిషేక్ ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో 0, 10, 14, 16, 15, 4, 7 రన్స్ మాత్రమే చేశాడు. ఇటీవలే సౌతాఫ్రికాతో జరిగిన తొలి టీ20లో కేవలం 7 పరుగులే చేసి ఔటయ్యాడు. ఆదివారం (నవంబర్ 10) రెండో టీ20 జరగనుంది. ఈ మ్యాచ్‌కు తుది జట్టులో మార్పులు చేసే చాన్స్ లేదు కాబట్టి అభిషేక్‌కు ఇది ఆఖరి అవకాశంగానే చెప్పొచ్చు. ఈ మ్యాచ్ లో విఫలమైతే అతను మరోసారి భారత జట్టులో అవకాశం దక్కక పోవచ్చు. ఒకవేళ టాప్ ఆర్డర్‌లో అతన్ని కొనసాగించాలంటే ఈ పెర్ఫామెన్స్ ఏమాత్రం సరిపోదు. జైశ్వాల్, గిల్, గైక్వాడ్, సంజు శాంసన్ రూపంలో తీవ్ర పోటీ ఉంది. ఈ నేపథ్యంలో అభిషేక్ శర్మ ఎలా ఆడతాడో చూడాలి.

# సౌతాఫ్రికాతో భారత్ రెండో టీ20.. మ్యాచ్‌కు వర్షం ముప్పు

**హైదరాబాద్ పెన్ పవర్:** తొలి టీ20 విజయంతో జోరుమీదున్న యంగ్ టీమిండియా.. సౌతాఫ్రికాతో రెండో మ్యాచ్‌కు రెడీ అయ్యింది. ఆదివారం జరిగే ఈ మ్యాచ్‌లోనూ గెలిచి నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో స్పష్టమైన ఆధిక్యంలో నిలవాలని భావిస్తోంది. టీ20 వరల్డ్ కప్ ఫైనలే అనుకుంటే సిరీస్ తొలి మ్యాచ్‌లోనూ ఓడటం సౌతాఫ్రికా ఆత్మవిశ్వాసాన్ని గట్టిగా దెబ్బతీసింది. దీంతో రెండో మ్యాచ్ లో గెలిచి లెక్క సరిచేయాలని చూస్తోంది. ఈ మ్యాచ్ హెూరాహెూరీగా జరగడం ఖాయమన్న దశలో వర్షం రూపంలో మ్యాచ్ కు అంతరాయం ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అక్యూవెదర్ ప్రకారం.. టాస్ సమయంలో వర్షం 49 శాతం నుండి 54 శాతం మధ్య కురుస్తుంది. రాత్రి 8 గంటలకు 63 శాతం.. రెండో ఇన్నింగ్స్ లో 40 శాతం వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. మ్యాచ్ మొత్తం రద్దయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ఒకవేళ వర్షం అంతరాయం కలిగిస్తే 5 ఓవర్ల మ్యాచ్ జరగనుంది. వాతావరణం చల్లగా ఉండడంతో పిచ్ ఫాస్ట్ బౌలర్లకు అనుకూలిస్తుంది. రాత్రి 7.30 గంటలకు స్పోర్ట్స్%-%18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుంది. ప్రస్తుతం సిరీస్ లో భారత్ 1-0 ఆధిక్యంలో ఉంది.




**జట్లు (అంచనా)**

ఇండియా : శాంసన్, అభిషేక్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్, అక్షర్ పటేల్ / రమణ్‌దీప్ సింగ్, అర్ష్‌దీప్ సింగ్, రవి బిష్ణోయ్, అవేశ్ ఖాన్, వరుణ్ చక్రవర్తి.

**సౌతాఫ్రికా :** మార్‌క్రమ్ (కెప్టెన్), రికెల్టన్, స్టబ్స్, క్లాసెన్, మిల్లర్, క్రుగెర్, యాన్సెన్, సిమిలెన్, కోయెట్జీ, కేశవ్ మహారాజ్, పీటర్ / బార్ట్‌మన్

# ట్రెడిషన్‌కి ట్రెండ్ టచ్.. సుప్రీత స్టన్నింగ్ పిక్

పింక్ రంగులో కరిష్మా తన్నా యొక్క అందమైన పోజులు





**హైదరాబాద్ పెన్ పవర్:** టాలీవుడ్ సీనియర్ నటి సురేఖ వాణి కూతురు సుప్రీత నాయుడు సోషల్ మీడియా ద్వారా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంటోంది. ఇక ఈమధ్య ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫోటోలు కూడా మరోసారి వైరల్ గా మారాయి. హైదరాబాదు బిర్లా మందిర్ దగ్గర తీసిన కొన్ని ఫోటోలతో తన ఫ్యాన్స్‌ను మరింతగా ఆకట్టుకుంది. చీరలో ప్రత్యేకమైన అందాన్ని హైలెట్ చేస్తూ నవ్వుతోనే మాయ చేసేసింది. గ్లామర్ తో పాటు సాంప్రదాయాల కలయికతో నిండి ఉన్న ఈ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. చీర అందాల్ని సొగసుగా ఒలకబోస్తూ బిర్లా మందిర్ ఆవరణంలో తీరికగా నడుస్తూ కనిపించిన సుప్రీత, సింపుల్ లుక్ లో దర్శనమిచ్చింది. ఈ ఫోటోలో ఆమె వేసుకున్న లైట్ పింక్ చీర, క్లాసీ జ్యువెలరీతో పర్ఫెక్ట్ గా మ్యాచ్ అవ్వడంతో ఫ్యాన్స్ పాజిటివ్ గా కామెంట్ చేస్తున్నారు. ఆమె లుక్ ప్రత్యేకమైన చారిత్రాత్మక స్థానంలో మరింత అందంగా నిలిచింది. హైదరాబాదు రాత్రి వెలుగుల్లో బిర్లా మందిరం సౌందర్యం, సుప్రీత రూపం కలిసి, పిక్స్‌లో విశిష్టమైన లుక్ క్రియేట్ అయ్యింది. ఇక ఎక్కువగా తల్లి సురేఖ వాణితో కలిసి అనేక పబ్లిక్ ఈవెంట్స్‌లో కనబడుతూ, గ్లామరస్ లుక్స్ తో అభిమానుల గుండెల్లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించింది. అయితే, సుప్రీత కేవలం తల్లి సురేఖ వాణి కూతురుగా మాత్రమే కాదు, తనకంటూ ఒక ప్రత్యేకమైన క్రేజ్ ను తెచ్చుకుంది. చిన్న వయసులోనే సోషల్ మీడియా ద్వారా విపరీతమైన ఫాలోయింగ్ సంపాదించింది. ముఖ్యంగా తన ఫ్యాషన్ స్టైల్ తో పాటు, గ్లామర్ పిక్స్ షేర్ చేస్తూ యూత్ ను మెస్మరైజ్ చేస్తోంది. త్వరలోనే హీరోయిన్ గా డెబ్యూ చేయబోతున్న ఈ బ్యూటీ, ప్రస్తుతం తన మొదటి సినిమాలో నటిస్తూ మరిన్ని కొత్త అవకాశాలు అందుకుంటుంది.

## సౌత్ హీరోతో చేయాలంటే ఆమె డబుల్ డిమాండ్



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com